విశాలాంధ్ర కృష్ణా జిల్లా

రోడ్డు పనులు పరిశీలించిన వెనిగండ్ల

విశాలాంధ్ర-గుడివాడ : గుడివాడలో ఎంతో కాలంగా సమస్యలలో ఒకటైన బైపాస్ రోడ్డు అభివృద్ధి పనులు తుది దశకు చేరుకున్నాయని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ఆదివారం తన వ్యక్తిగత సిబ్బంది, పలువురు నాయకులతో కలసి రూ.2.50 కోట్ల ఆర్అండ్‌బి నిధులతో ప్రారంభించిన బైపాస్ రోడ్డు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పరిశీలించారు. తుది దశలో జరుగుతున్న ఫైనల్ కోట్ బీసీ వర్క్ పనుల వివరాలను అధికారులు ఎమ్మెల్యే రాముకు తెలిపారు. బైపాస్ రహదారికి అనుసంధానంగా ఉన్న సీసీ రోడ్లకు కనెక్టివిటీ పనులు కూడా పూర్తి చేయాలని అధికారులకు ఎమ్మెల్యే రాము కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గుడివాడ ప్రధాన సమస్యల్లో ఒకటైన బైపాస్ రోడ్డు అభివృద్ధి పనులు 90శాతం పూర్తయినట్లు, మరో రెండు రోజుల్లో తుది దశ పనులు కూడా పూర్తవుతాయన్నారు. త్వరలో బస్టాండ్ అభివృద్ధి పనులు ప్రారంభం అవుతాయన్నారు. మరో ప్రధాన సమస్య అయిన కంకిపాడు రహదారి అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

విద్యావికాస్ 'పది' విద్యార్థుల ఫేర్‌వేల్

విశాలాంధ్ర-గుడివాడ : విద్యావికాస్ 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. విద్యావి వికాస్ డైరెక్టర్ కొమ్మినేని సాంబశివరావుతో కలసి జ్యోతి పాలిటెక్నిక్ కళాశాల ఫౌండర్ సూరపనేని వెంకటరమణలు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు క్రమశిక్షణ అంకితభావం ఎంతో అవసరమన్నారు. విద్యావికాస్ విద్యార్థులు ర్యాంకుల కోసమే కాకుండా ఉన్నత విలువలు అలవర్చుకోవలన్నారు. గత ఏడాది అత్యధికంగా 590 మార్కులతో పాటు 10 మంది 550 మార్కులు సాధించడం అభినందనీయమన్నారు. అనతరం 10వ తరగతి విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో హెచ్ఎం చాట్రగడ్డ నాగమల్లేశ్వరరావు, ప్రైమరీ హెడ్ మాస్టర్ పి.ఆశీర్వాదం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వందరోజుల ప్లాన్‌కు పటిష్ట చర్యలు

విశాలాంధ్ర, కూచిపూడి : పదవ తరగతి విద్యార్థులకు డిసెంబర్ 6వ తేదీ నుంచి ప్రారంభమై 2026 సంవత్సరం మార్చి 15 వరకు నిర్వహించే 100 రోజులు యాక్షన్ ప్లాన్ అమలుకు అధికారుల సూచనలతో మొవ్వ మండలంలో పదవ తరగతి నిర్వహించే ఎనిమిది జిల్లా పరిషత్ పాఠశాలలకు మండల స్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించి పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. ఈ విషయాన్ని మొవ్వ మండల విద్యాశాఖాధికారి-1 అమ్ముల భాను ప్రకాష్ పేర్కొన్నారు. మొవ్వ పిఎం శ్రీ శ్రీ మండవ కనకయ్య జిల్లా పరిషత్ హై స్కూలుకు పంచాయతీరాజ్ ఏఈ బి.రామారావు, కాజ శ్రీ పేకేటి నర్సారెడ్డి జిల్లా పరిషత్ హై స్కూల్ కు ఎలక్ట్రికల్ ఏ ఈ కె.వి. వి. రమేష్ బాబు, శ్రీ సిద్దేంద్ర జిల్లా పరిషత్ ఓరియంటల్ హైస్కూల్ మండల గృహ నిర్మాణ శాఖ ఏఈ జి.వంశి, భట్ల పెనుమర్రు హైస్కూల్‌కు ఎంపీడీవో డి సుహాసిని, డిప్యూటీ ఎంపీడీవో పి త్రినాథ్, తహసిల్దార్ కే మస్తాన్, పెడసనగల్లు హైస్కూల్‌కు ఆర్.డబ్ల్యు.ఎస్. ఏ.ఈ.కె ఎస్ఆర్‌కెఎస్ ప్రసాద్, నిడుమోలు హైస్కూల్ కు వ్యవసాయ శాఖ అధికారి బి.సురేష్ బాబు నాయక్ లను నియమించారు. ఆదివారం సోషల్ మరియు ఫిజికల్ సైన్స్ తరగతులను నిర్వహించారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర, కూచిపూడి : మొవ్వ మండలం అయ్యంకి గ్రామంలో ఆదివారం ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా రాజులపాటి రెడ్డి కి 35 వేల రూపాయల చెక్కు, వీరంకి అమ్మగారికి రూ. 23 వేల చెక్కు, శ్రీనివాసరావుకు రూ.64,258 చెక్కు ఇచ్చారు. పెడసనగల్లులో గారపాటి అరుణ్ కుమార్ కి 25 వేలు, జుజ్జవరపు వసంత కుమార్ కి 25వేల రూపాయలుచెక్కు అందజేశారు. కార్యక్రమాల్లో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు నన్నపనేని వీరేంద్ర, మండల కార్యదర్శి వీరంకి తులసీదాస్, నాయకులు తాతా దుర్గాప్రసాద్ రాజులపాటి పెద్ద మస్తాన్, యద్దనపూడి రాఘ శేఖర్, జన సైనికుడు పోతుల వెంకట శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

కాజాలో పేకాట రాయుళ్ల అరెస్టు

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలం కాజలో ఆదివారం పొలాల వద్దడబ్బులతో కోతముక్క(పేకాట) ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను పట్టుకొని వారి వద్ద నుంచి 1640 నగదు 52 పేక ముక్కలను స్వాధీన చేసుకుని కేసు నమోదు చేసినట్లు కూచిపూడి ఎస్సై పిశిరీష తెలిపారు.

కూచిపూడిలో..

మొవ్వ మండలం కూచిపూడిలోని మూడవ వార్డులో గలపక్షులబీడులో డబ్బులు ఫణంగా పెట్టి పేకాట ఆడుతున్న ఎనిమిదిమంది పేకాట రాయుళ్లను రూ.5,800 నగదు, 52 పేక ముక్కలతో అదుపులోకి తీసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి శిరీష తెలిపారు.

మెగా క్రికెట్ పోటీలు ప్రారంభం

విశాలాంధ్ర, కూచిపూడి : గొట్టిపాటి సాయి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2026వ సంవత్సరం జనవరి 10వ తేదీ వరకు మొవ్వ మండలంలోని అయ్యంకి అడ్డరోడ్ సమీపంలో యద్దనపూడి గ్రామ పంచాయతీ పరిధిలోని పొలాలలో రెండు వారాలు నిర్వహించే మెగా క్రికెట్ టోర్నీ ఆదివారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా ప్రారంభించి, ఫ్రెండ్లీమ్యాచ్‌లో పాల్గొన్నారు. ఎస్ఐ పి శిరీష, మొవ్వ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు లింగమనేని రామలింగేశ్వర రావు ఫ్రెండ్లీ మ్యాచ్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గొట్టిపాటిఫౌండేషన్ నిర్వాహకులు గొట్టిపాటి సాయి, రాష్ట్ర గృహ నిర్మాణ కార్పొరేషన్ డైరెక్టర్ లింగమనేని రామలింగేశ్వరరావు అభినందించారు.

2026 క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-విజయవాడ : నూతన సంవత్సర సందర్భంగా ముత్యాలంపాడులో వేంచేసియున్న షిరిడి సాయిబాబా మందిరంలో సాయిబాబా క్యాలెండర్ అధ్యక్షులు పి గౌతంరెడ్డి ఆవిష్కరంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరంలో వలే ఈ సంవత్సరం కూడా శ్రీ షిరిడి సాయిబాబా క్యాలెండర్ భక్తులకు ఉచితంగా డిసెంబర్ 31వ తేదీ అర్ధరాత్రి 12 గంటలకు నుండి భక్తులకు ఇస్తారని ఆయన తెలిపారు. నూతన సంవత్సర సందర్భంగా సాయిబాబా భక్తులకు ప్రజానీకానికి ఆహ్వానం పలుకుతున్నామని ఆయనఅన్నారు. ఈ కార్యక్రమంలో అలయసిబ్బంది, నిర్వాహకులు కార్యదర్శి శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు వేశారు గోతులు మరిచారు

- స్లమ్ ఏరియాలో రోడ్డులు వేసే వాటిని పట్టించుకోరా
- వాల్ కి మూతలు లేక యాక్సిడెంట్‌లు
- పేద వారు నివాసించే ప్రాంతాలలో ఇలానే చేస్తారా
- వాల్ రోడ్డు మధ్యలో ఉండడం వల్ల పలువురికి గాయాలు

విశాలాంధ్ర - గుడివాడ : తాళం వేశాను, కానీ గోళ్లేం మర్చిను అనే విధంగా మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు తీరు ఉంది. స్థానిక అరవ పేటలో గత కొన్ని సంవత్సరాలుగా రోడ్డు లేక ప్రజలు ముఖ్యం పేదవర్గలో ఏక్కువగా నివాసించే ప్రాంతాం అరపేట, ఏ అధికారపార్టీ కూడ రోడ్డు గుర్చి కనీసం పట్టించుకోక పోవడంతో

నూతనంగా ఎమ్మెల్యేగా వచ్చిన ఎన్ఆర్ఐ వెనిగండ్ల రాము చొరవతో రోడ్డును నెల రోజుల క్రితం నిర్మించారు. అయితే కట్రాక్టర్ రోడ్డుకు మధ్యలో నిర్మించిన 2 పెద్ద గోతులు (గేట్‌వాల్వ్, ఫుట్ వాల్వ్)పై ముతా పెట్టాలి, కానీ ఆది నిర్లక్షంగా వదిలి చేశారు.

దీని వల్ల ఈ పాంతాంలో వచ్చే వాహనాలకు రోడ్డు మధ్యలో ఉన్న రెండు వాల్వ్‌ల వల్ల ఇటివల అనేక యాక్సి డెంట్‌లు జరిగినట్లు స్థానికులు తెలిపారు. ఈదే వాల్వ్‌లో చిన్న పిల్లలు పడితే వారి ప్రాణాలకే ప్రమాదం జరుగుతుందని స్థానికులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనదారులు ప్రమాదాల బారిన పడి, ఇప్పటికే పలువురికి గాయాలు అయినట్లు సమాచరం. కనీసం ప్రాంతంలో ప్రమాద సూచిక కూడా ఏర్పాటు చేయకపోవడం గమర్హం. ఎంతో ఎత్తులో నూతన రాహదారిని నిర్మించినప్పటికి ప్రమాదభరితంగా ఉన్న గుంటల రోడ్డు వేశారని వాహనదారులు వాపోతున్నారు. వాల్ కి మూత పెట్టటం మాత్రం మరిచార, లేక పేదవర్గలు నివాసించే ప్రాంతమే కదా నిర్లక్షం చేస్తున్నరో అర్ధకాని ప్రశ్నగా మిగిలిపోయింది.

రోడ్డు మధ్యలో వాల్‌కి మూత వేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్న మునిసిపల్ ఇంజనీరింగ్ సిబ్బంది, ఈ రోడ్డును నిర్మించిన కాంట్రాక్టర్‌పై ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, మున్సిపల్ ఉన్నతాధికారులు, చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

లక్ష్మీపురంలో పిచ్చికుక్క స్వైరవిహారం

9 మందికి గాయాలు, వక్కలగడ్డలో మరో ఐదుగురు

విశాలాంధ్ర-చల్లపల్లి : చల్లపల్లి మండలం లక్ష్మీపురంలో పిచ్చికుక్క స్వైరవిహారం చేస్తోంది. కుక్క దాడిలో శని, ఆదివారాల్లో 9మంది గాయపడ్డారు. ఆదివారం ఉదయం పిచ్చికుక్క ఐదుగురిపై దాడిచేసి కరిచింది. లక్ష్మీపురంకు చెందిన జయంపాటి శ్రీదేవి, చింతలమడకు చెందిన సూదాని విష్ణుమూర్తిలు తీవ్రంగా గాయపడగా చల్లపల్లి ప్రభుత్వాసుపత్రిలో చికిత్సపొందారు. పిచ్చికుక్క దాడిలో విష్ణుమూర్తి ఎడమకాలికి తీవ్రగాయమై కాలువాచింది. ఇదిలా ఉండగా, వక్కలగడ్డలో పిచ్చికుక్క తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు. శనివారం ఐదుగురిని కరిచిందినీ, స్థానికులు కర్రలతో వెంటపడగా వారికి చిక్కకుండా పారిపోయిందని చెబుతున్నారు. లక్ష్మీపురం, వక్కలగడ్డలో మాత్రమే కాకుండా, గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువై రాత్రివేళ పాదచారులు, సైక్లిస్టులు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కుక్కలను నియంత్రించాల్సిందిగా పంచాయతీ అధికారులను కోరుతున్నారు.

అభివృద్ధి పథంలో గన్నవరం

ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

విశాలాంధ్ర-గన్నవరం : పట్టణాన్ని అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకటరావు తెలిపారు. గన్నవరం రాయి కో-ఆపరేటివ్ సొసైటీ ప్లాటినం ప్లాటినం జూబ్లీ ఉత్సవాలు బ్రోచర్ని తెలియజేశారు. ఆధ్వర్యంలో డాక్టర్ సి ఎల్ రాయుడు విగ్రహాలని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, ఎమ్మెల్యే వెలిగండ్ల రాము కాట్రగడ్డ రాయుడు విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు రాయి నగర్ కో-ఆపరేటివ్ సొసైటీ సభ్యులు పెద్ది వెంకట రత్నం అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ డాక్టర్ సిఎల్ రాయుడు ముందుచూపుతో సొసైటీలో పెద్దపెద్ద రోడ్లు వేశారని అది భవిష్యత్తు తరానికి మార్గదర్శిని తెలిపారు. గన్నవరం నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా ఎంతోమంది పెద్దలు ఎమ్మెల్యేగా పని చేశారని వారిలో పుచ్చలపల్లి సుందరయ్య ఎంతో అభివృద్ధి చేశారని తన వంతుగా గన్నవరం అభివృద్ధికి తలవంత కృషి చేస్తానని అలాగే సెంటర్లో సుందరయ్య విగ్రహానికి ఏర్పాట్లు చేస్తానని హామీ ఇచ్చారు. గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ రాయ నగర్ సొసైటీ లోనే చిన్నతనంలో ఆడుకున్నానని నాకు ఈ సొసైటీ తో అనుబంధం ఉందని తెలిపారు. సొసైటీ అభివృద్ధికి సిఎల్ రాయుడు పెద్ద వెంకటరాయుడులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ముల్పూరి బాలకృష్ణరావు, మాజీ ఎమ్మెల్యే మురుసూరి రత్న బోస్, సీపీఐ కృష్ణా జిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు, విశాలాంధ్ర బుక్ హౌస్ ఎడిటర్ గద్దం కోటేశ్వరరావు, గన్నవరం సర్పంచ్ పాలడుగు రామవరప్రసాద్, సీపీఎం జిల్లా కార్యదర్శి వెలగా నరసింహారావు, సొసైటీ సెక్రటరీ మన్నే సుంద రావు, కాట్రగడ్డ రామచందర్‌జోషిలు పాల్గొన్నారు.

టిడిపి విస్తృతస్థాయి సమావేశం

విశాలాంధ్ర-పెడన : పట్టణంలోని తోటమూల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉత్తమ కార్యకర్తల సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పథకాలను అందరికీ అందుబాటులోకి తీసుకు రావడం, ప్రజలందరిలో స్వయం సమృద్ధి, సాధికారతను ప్రోత్సహించడం వంటి లక్ష్యంతో సుపరిపాలనలో తొలి అడుగు రూపకల్పన చేశారు. ఏదైతే లక్ష్యంతో పార్టీ ఆదేశించిందో దాన్ని నియోజవర్గంలో అందరూ బాగా కృషి చేశారని అన్నారు. అందులో పార్టీలో కొంతమంది ప్రతిభ చూపెట్టిన వారికి ఈరోజు సర్టిఫికెట్లను అందజేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ కార్యకర్త వీణం. శ్రీనివాస్ మాట్లాడుతూ ఎంతో ఆదరణ విశిష్టత కలిగిన ఇంతటి పురస్కారం నా ఆశయాలకు తగిన గుర్తింపు ద్వారా ఉత్తమ కార్యకర్త అవార్డు దక్కించుకోవడం చాలా సంతోషంగా ఉందని పట్టణ అభివృద్ధి కొరకు దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే ఆధ్వర్యంలో శాయ శక్తులా కృషి చేస్తానని వారి అనుచరునిగా పట్టణ అభివృద్ధికి తోటి నాయకుల సహకారంతో అధినాయకుల ఆదేశాలు శిరోధార్యంగా భావించి పార్టీకి ఎల్లవేళలా అందుబాటులో ఉండి మరింత ఉత్సాహంతో కార్యదక్షత చూపుతానని శ్రీనివాస్ అన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ ఒడుగు. తులసిరావు,గూడూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గోపి. నాగబాబు,బొర్రా.కాశీ,పట్టణ టిడిపి అధ్యక్షుడు శ్యామలయ్య, మండల టిడిపి అధ్యక్షుడు చెలపాటి ప్రసాద్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అబ్దుల్ ఖయ్యూం తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు రెడ్ క్రాస్ సాయం

విశాలాంధ్ర-చల్లపల్లి : చల్లపల్లి మండలం రామానగరం తోటవారి బజారులో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వంకోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన అనూరాధ కుటుంబానికి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చల్లపల్లి సబ్ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఆదివారం సహాయం అందచేశారు. ఐఆర్సీఎస్ జిల్లా చైర్మన్ డాక్టర్ డీఆర్ కె.ప్రసాద్ చల్లపల్లి బ్రాంచ్ ప్రతినిధులతో కలిసి బాధితులను పరామర్శించారు.

బాధిత కుటుంబానికి డాక్టర్ డీఆర్ కె రూ.5వేల ఆర్థికసహాయం అందించగా, జిల్లా బ్రాంచ్ ద్వారా వంటపాత్రలు, హెవీ టార్పాలిన్, చల్లపల్లి సబ్ బ్రాంచ్ ద్వారా నిత్యావసర సరుకులు అందించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో సీసీ తూము వెంకటేశ్వరరావు, ఆర్ఏ ఘంటసాల కృష్ణమోహన్, చల్లపల్లి సబ్ బ్రాంచ్ చైర్మన్ నడకుదురు లీలాబ్రహ్మేంద్ర, ఎండిఎకె.జిలానీ, ఆకురాతి హరిప్రసాద్, బళ్లా మధుసూధనరావు, ఆకుల సుధీర్కుమార్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర బ్యూరో-మచిలీపట్నం : కాంగ్రెస్ పార్టీ 141 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కృష్ణా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం పట్టాభి భవనం మచిలీపట్నం నందు అసెంబ్లీ కోఆర్డినేటర్ అబ్దుల్ మతీన్ రాట్నం ఉన్న పార్టీ పతాకాన్ని ఎగురవేసి మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా అబ్దుల్ మతీన్ మాట్లాడుతూ బ్రిటిష్ వారి కబంధ హస్తాల నుండి భారతదేశాన్ని రక్షించడం కోసం స్వేచ్ఛా వాయువుల కోసం నడుం బిగించి ప్రాణ త్యాగాలకు సిద్ధపడిన చరిత్ర ఈ దేశంలో కాంగ్రెస్ కు మాత్రమే ఉందని అన్నారు స్వాతంత్రమే లక్ష్యంగా సత్యం అహింస ఆయుధంగా కాంగ్రెస్ పార్టీ సాగించిన పోరు భారత దేశంలోనే కాక ప్రపంచ దేశాలలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ విషయం అని అన్నారు. అంత ఘన చరిత్ర ఉన్న త్యాగధనుల కాంగ్రెస్ పార్టీని నేటి కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోడీ నోటికి వచ్చినట్లు గాంధీ ని నెహ్రూ ని గాంధీ కుటుంబాన్ని మాట్లాడడం పిరికి పందల చర్య అని అన్నారు, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి అమలు చేస్తే నేటి మోడీ ప్రభుత్వం ఆ పథకానికి మంగళం పాడి నిధులను కోసి నిధులు లేని కొత్త పథకాన్ని తేవటం సాక్షాత్తు జాతిపితను అవమానించడమే అని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ అబ్దుల్ మతీన్, పిసిసి డెలిగేట్ కోకా ఫణి భూషణ్, నల్లబోలు కుమారి, చిలుకోటి ప్రసాద్, షేక్ అయ్యుబ్, సామ్యూల్, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ఉన్మాద రాజకీయాలకు పరాకాష్ఠ

అవనిగడ్డలో టీడీపీ నేతల తీవ్ర విమర్శలు

విశాలాంధ్ర - అవనిగడ్డ : వైకాపా అధినేత జగన్ పుట్టినరోజు వేడుకల్లో ఆయన ఫ్లెక్సీలకు రక్తాభిషేకాలు చేయడం, ఇంటి ముందు టపాసులు కాల్చొద్దన్నందుకు ఓ గర్భిణి కడుపుపై కాలితో తన్ని వైకాపా నాయకులు దాడి చేయడం ఉన్మాదానికి పరాకాష్ఠ' అని దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, టీడీపీ నేత పర్చూరి దుర్గాప్రసాద్ లు ధ్వజమెత్తారు. ప్రపంచంలో ఎక్కడైనా కత్తులు, తల్వార్లతో కేకులు కోస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఆదివారం అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయం లో విలేకర్లతో సమావేశంలో మాట్లాడాతూ రాజకీయ ముసుగులో ఉన్మాదులుగా మారిన వైకాపా నేతల పై కూటమి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని వారిని వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు మూగజీవాల్ని బలిచ్చి రక్తాభిషేకాలు చేయడం అమానుషమని రప్పా రప్పామని నరుకుతాం.. 2029లో ఇదే రిపీట్ అవుతుంది, గంగమ్మ జాతరలో పొట్టేలును నరికినట్టు నరుకుతాం అంటూ నినాదాలు చేయడం వారి నేరపూరిత ఆలోచనకు అద్దంపడుతోందని ఇలాంటి ఫ్యాక్షన్ సంస్కృతి రాష్ట్ర భవిష్యత్తుకు అత్యంత ప్రమాదకరం అని నేతలు పేర్కొన్నారు.ఈ సమావేశంలో కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి రావి రత్నగిరి, నాగాయతిప్ప పీఏసీఎస్ అధ్యక్షుడు బళ్ళ ప్రసాద్ , అవనిగడ్డ రాజశేఖర స్వామి దేవస్థానం చైర్మన్ ఘంటసాల రాజమోహనరావు, పార్టీ సీనియర్ నేత మండలి రామమోహనరావు, కంచర్ల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కొండలమ్మ ఆలయం కిటకిట

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: మండల పరిధిలోని వేమవరం గ్రామములో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానమునకు ఆదివారము ఆగుట వలన అధిక సంఖ్యలో షుమారు 10,000 మందికి పైగా భక్తులు శ్రీ కొండలమ్మ అమ్మవారిని దర్శించుకొనినారు. భక్తుల సౌకర్యార్థం త్రాగునీరు, ఉచిత ప్రసాద వితరణ జరిగినది. దేవస్థానం పరిసరాలు శుభ్రం చేయించి, బ్లీచింగ్ చల్లించటమయినది. శ్రీ అమ్మవారికి అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాలపొంగళ్లు సమర్పించినారు. దేవస్థానము పరిసరములలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా గుడ్లవల్లేరు ఎస్ఐ సత్యనారాయణ తమ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. దేవస్థానం చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహన్ రావు, ఈవో ఆకుల కొండలరావు తమ సిబ్బందితో సహా శ్రీ అమ్మవారి దేవస్థానములో ఏర్పాట్లను పర్యవేక్షించినారు. అదేవిధంగా శ్రీ అమ్మవారి దేవస్థానమునకు కృష్ణాజిల్లా సోషల్ వెల్ ఫేర్ డి.డి కృష్ణా జిల్లా మచిలీపట్నం అధికారి ఎస్ కె. షహీద్ బాబు, గుడివాడ ఎక్సైజ్ సిఐ పి. వెంకట రమణ మరియు గుడివాడ ఎక్సైజ్ ఎస్ఐ పి.హేమ సుష్మిత కుటుంబ సమేతంగా విచ్చేసి శ్రీ కొండలమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి దేవస్థాన చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహన రావు శేష వస్త్రముతో సత్కరించి అమ్మవారి చిత్రపటమును, ప్రసాదం అందజేయడం జరిగినదని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు తెలిపారు.

గుంతలు లేని రహదారులే కూటమి లక్ష్యం

విశాలాంధ్ర -పమిడిముక్కల: పామర్రు నియోజకవర్గంలో ఆర్ అండ్ బి రహదారుల అభివృద్ధికి పలు పథకాల ద్వారా రూ.39.4 కోట్లు మంజూరైనట్లు ఇక గుంతలల్లేని రోడ్లు చూడబోతున్నామని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. వీరంకిలాకులో తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరంకిలాకు పెనమకూరు కపిలేశ్వరపురం ముదిరాజుపాలెం మేడూరు ధూళిపూడి పాలెం చోరగుడి అలీనఖీపాలెం తదితర రహదారుల నిర్మాణం త్వరలో ప్రారంభిస్తారని తెలిపారు. గతంలో కాంట్రాక్టర్లకు రూ.70కోట్లు ఎగ్గొట్టడంతో చాలా పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయని తెలిపారు. హెల్త్ క్లినిక్ నిర్మాణాలకు రూ.10 కోట్ల మంజూరయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రాజులపాటి శ్రీనివాసరావు కార్యదర్శి కే బాబ్జి పార్టీ నాయకులు లింగమనేని బాబురావు నాదెళ్ల సుబ్రహ్మణ్యం పలువురు పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నేడు చల్లపల్లిలో రెవెన్యూ క్లినిక్

విశాలాంధ్ర - చల్లపల్లి : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నేడు రెవెన్యూ క్లినిక్ జరుగుతుందని తహశీల్దార్ డి. వనజాక్షి తెలియజేశారు. ప్రభుత్వం భూసంబంధిత సమస్యల పరిష్కారానికి ఈ క్లినిక్ ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ క్లినిక్ లో 22 ఏ సమస్యలు, భూసేకరణ సంబంధిత సమస్యలు, రీ సర్వే విస్తీర్ణం తేడా జాయింట్ ఎల్పియం సంబంధిత సమస్యలు, ఆర్ఓఆర్, పట్టాదారు పుస్తకములు,సుమోటో అడంగల్ కరెక్షన్ సంబంధిత సమస్యలుతో పాటు ఇతర రెవెన్యూ సమస్యలపై అర్జీలను స్వీకరించడం జరుగుతుందని ఆమె వివరించారు. ప్రతి సోమవారం పనిదినాల్లో ఈ రెవెన్యూ క్లినిక్ ను నిర్వహించనున్నట్లు ఆమె తెలియజేశారు.

నేడు 10వ తరగతి విద్యార్థులకు ఓరియంటేషన్ క్లాస్

విశాలాంధ్ర-చల్లపల్లి : చల్లపల్లి చంద్ర రాజేశ్వరరావు వికాసకేంద్రంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచీ సాయంత్రం ఐదు గంటల వరకు చల్లపల్లి, మోపిదేవి, ఘంటసాల మండలాల పదవ తరగతి విద్యార్థినీ విద్యార్థులకు ఓరియంటేషన్ క్లాసు నిర్వహించనున్నట్లు చల్లపల్లి ఎమ్మీవోలు తెలిపారు. పబ్లిక్ పరీక్షల్లో పరీక్షలు బాగా రాసేలా నిష్ణాతులైన ఉపాధ్యాయులచే ఒకరోజు శిక్షణ జరుగుతుందన్నారు. ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ డికె. బాలాజీ, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ప్రత్యేక అధికారి పి.సాయిబాబు, డీఈవో యువి.సుబ్బారావులు పాల్గొంటారని చెప్పారు.

అమ్మవార్లకు ఆర్యవైశ్య మహిళల సారె

విశాలాంధ్ర-చల్లపల్లి : చల్లపల్లి ఆర్యవైశ్య మహిళలు ధనుర్మాసం సందర్భంగా ఆదివారం అమ్మవార్లకు సారె సమర్పించారు. శ్రీఆర్యవైశ్యసంఘ భవనంలోని గీతామందిరంలో గోదాదేవికి, గ్రామదేవత శ్రీసంపటాలమ్మ అమ్మవారికి, శ్రీకన్యకా పరమేశ్వరీ అమ్మవారికి, శ్రీగరుడ ఆం జనేయ సహిత వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శ్రీగోదాదేవి అమ్మవారికి సారె సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

శారీరక , మానసిక ఆరోగ్యానికి

సైకిల్ సవారీ దోహదం

పెడల్ ఫర్ ఫిట్‌నెస్ స్ఫూర్తితో ముందుకు సాగాలి : కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

విశాలాంధ్ర-విజయవాడ: ఆరోగ్యకర జీవితంతో పాటు కాలుష్య రహిత భవిష్యత్తుకు సైకిల్ సవారీ దోహదం చేస్తుందని.. చిన్నారులు, యువత సైక్లింగ్‌ను ఓ ఆనందకర అలవాటుగా చేసుకొని శారీరక, మానసిక ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఫిట్ ఇండియా ఆన్ సండేస్ సైకిల్ రన్ కార్యక్రమం నగరంలోని డా. బీఆర్ అంబేద్కర్ స్మృతివనం వద్ద జరిగింది. ఇందులో భాగంగా కలెక్టర్ సైక్లింగ్‌ను జెండా ఊపి ప్రారంభించడంతో పాటు 50 మందికిపైగా చిన్నారులతో పాటు క్రీడా శాఖ అధికారులు, సైక్లింగ్ అసోసియేషన్ సభ్యులతో కలిసి బెంజ్ సర్కిల్, పాలీ క్లినిక్ రోడ్డు, పీబీ సిద్ధార్థ కళాశాల, రెడ్ సర్కిల్ మీదుగా దాదాపు 9 కి.మీ. సైక్లింగ్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ శారీరక ఆరోగ్యం ఎంత ముఖ్యమో మానసిక ఆరోగ్యమూ అంతే ముఖ్యమని.. సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవడంతో పాటు భావితరాలకు కాలుష్య రహిత పర్యావరణాన్ని వారసత్వ సంపదగా అందించేందుకు ప్రతిఒక్కరూ సైక్లింగ్ ను హాబీగా మార్చుకొని ముందుకువెళ్లాలని, ఓ మంచి అలవాటు ఎన్నో విజయాలకు సోపానమవుతుందని పేర్కొన్నారు. అందుకే అవగాహన పెంచుకొని సైక్లింగ్ ను అభిరుచిగా మార్చుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఎస్‌డీవో కాకర్ల కోటేశ్వరరావు, జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ సభ్యులు సుగుణరావు, కోచ్ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

శ్రమ జీవులైన కార్మిక- కర్షకులకు అండ సీపీఐ

మల్నిడి యలమందరావు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): శ్రమజీవులైన కార్మిక- కర్షకులకు అండగా, నిరంతరం పోరాడేది భారత కమ్యూనిస్టు పార్టీ అని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఉపాధ్యక్షుడు మల్నిడి యలమందారావు అన్నారు. ఇబ్రహీం పట్నం మండలం కొటికలపూడి గ్రామశాఖ ఆధ్వర్యంలో సీపీఐ 101 వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత పార్టీ జెండాను గ్రామశాఖ కార్యదర్శి మల్నిడి బాబురావు, తెలంగాణా పోరాట యోదుల అమరవీరుల స్థూపం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యలమందరావు మాట్లాడుతూ దున్నేవాడికే భూమి దక్కాలని గ్రామంలోని 50 ఎకరాల లంక భూములు, పేదలకు పంచిన ఘనత గ్రామశాఖదే అన్నారు. 101 సంవత్సరాలు నుంచి సీపీఐ ప్రజా సమస్యల పరిష్కారానికి అలుపెరగని పోరాటం చేస్తోందన్నారు. నైజాం నవాబులకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటంలో ముగ్గురు అమరులైయరని గుర్తు చేశారు. 78 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో కార్మికులు, రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారని తెలిపారు. వారి సమస్యలు పరిష్కారాని, ఎర్రజెండాలు ఐక్యంకావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జొన్నలగడ్డ కోటేశ్వరరావు, మల్నిడి గోవిందరామ, పూర్ణచంద్రరావు, నాయుడు సాంబశివరావు, కోటయ్య, ప్రకాష్, కళావతి, విజయలక్ష్మీ, వెంకట నాగేశ్వరరావు, గోవిందయ్య, సద్దాం, బాపయ్య, దాసు, శ్యాంబాబు, తదితరుల పాల్గొన్నారు.

మైనార్టీల భాషాపర హక్కులను పరిరక్షించాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సమావేశం గాంధీనగర్లలని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు ముజ్తబా ఫారూఖ్, పార్టీ ఇన్‌చార్జి హబీబుల్లాఖాన్ ప్రత్యేక ఆహ్వానితులుగా విచ్చేశారు.ఈ సమావేశం ప్రాంతీయ జాతీయ అంతర్జాతీయ సమస్యలతో పాటు పార్టీ అంతర్గత సమస్యలను చర్చించి పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించడమైంది.డిసెంబర్ 25 క్రిస్టమస్ సందర్భంగా ఫ్యాసిస్ట్ శక్తులు దేశవ్యాప్తంగా చర్చిలపై దాడులు చేసి క్రైస్తవ సోదరులకు వారి ప్రార్థనలకు అంతరాయం కలిగించే దుశ్చర్యలను సమావేశం ఏకగ్రీవంగా ఖండించారు.ఆరావళి పర్వతాలను రక్షించుకోవడానికి కదిలిన పదిలక్షల పౌర సమాజానికి రైతులకు పర్యావరణ పరిరక్షకులకు సమావేశం జేజేలు పలికారు.బంగ్లాదేశ్ లో మైనారిటీలపై భారత దేశంలో మైనారిటీపై ప్రపంచ వ్యాప్తంగా ఏ దేశంలోనైనా మైనారిటీలపై జరిగే దాడులు మానవ హక్కులకు వ్యతిరేకమని తక్షణమే ప్రభుత్వాలు వీటిపై స్పందించి మైనారిటీల సాంస్కృతిక మతపర భాషాపర హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేసింది. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రెసిడెంట్ కె.ఎం.ఏ సుభాన్, తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర ఎన్టీఆర్ జిల్లా

జిల్లా శాఖ నామినేషన్లకు భారీగా తరలిరండి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : ఏపీ ఎన్జీజీవోస్ అసోసియేషన్ ఎన్టీఆర్ జిల్లా శాఖకు జరగనున్న ఎన్నికలకు సంబంధించి జనవరి 3న నామినేషన్ల కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా ఉద్యోగులు భారీగా తరలి వచ్చేలా ఏర్పాట్లు చేయాలని జిల్లా అధ్యక్షులు డి.సత్యనారాయణరెడ్డి కోరారు.ఎపి ఎన్జీజీఓ ఎన్టీఆర్ జిల్లా కార్యవర్గ సమావేశం గాంధీనగర్ ఎన్జీఓ హోమ్ లో సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లా శాఖకు ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేసిన నేపథ్యంలో జనవరి 3వ తేదీన నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు.రాష్ట్ర అధ్యక్షులు ఎ. విద్యాసాగర్ ప్యానల్ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ప్యానల్ అభ్యర్థులు 3 వ తేదీ ఉదయం 11.00 గంటలకు విజయవాడ పాత బస్ స్టాండ్ నుండి ఉద్యోగుల తో భారీ ర్యాలీ గా బయలుదేరి గాంధీనగర్ ఎన్జీఓ హోమ్‌లో ఎన్నికల అధికారికి నామినేషన్లు దాఖలు చేస్తారని తెలిపారు.అత్యంత ప్రతిష్ఠామకమైన ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ విజయవంతం చేసేలా భారీ స్థాయిలో ఉద్యోగులను భాగస్వామ్యులను చేసేలా జిల్లా లోని తాలుకా యూనిట్లు సిటీ యూనిట్ కార్యవర్గ సభ్యుల కృషి చేయాలని కోరారు. నామినేషన్ల కార్యక్రమానికి రాష్ట్ర సంఘ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎ.విద్యాసాగర్ డి వి రమణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జే ఏ సి నాయకులు సంఘ మాజీ నాయకులు వివిధ శాఖల ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొంటారని తెలిపారు.ఈ కార్యక్రమం లో జిల్లా కార్యవర్గ సభ్యులు పి.రమేష్ వి వి ప్రసాద్ బి.సతీష్ కుమార్ బి .వి.రమణ ఎం.రాజుబాబు జి. రామకృష్ణ వి.నాగార్జున డి.విశ్వనాథ్ సి హెచ్ దిలీప్ కుమార్ కె.శివలీల శ్రీనివాసరావు నగరశాఖ అధ్యక్ష కార్యదర్శులు సివిఆర్ ప్రసాద్ ఎస్ కె నజీరుద్దీన్ జగ్గయ్యపేట, నందిగామ, కంచిక చర్ల, మైలవరం, విస్సన్నపేట, తిరువూరు తాలూకా యూనిట్ల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ 141వ ఆవిర్భావం

విశాలాంధ్ర-తిరువూరు: కాంగ్రెస్ పార్టీ కార్యాలయం రాజీవ్ భవన్‌లో ఆదివారం కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. తిరువూరు బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొడ్డు ప్రకాష్ రావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పల్లెపాటి శ్రీనివాస రావు, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జీవన్ బాబు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఈ దేశ స్వాతంత్ర్యానికి మూల కారణమని, మహాత్మా గాంధీ, పండిట్

జవహర్లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్, సుభాష్ చంద్రబోస్, అరవింద ఘోష్, భగత్ సింగ్ వంటి మహానుభావులు తమ ధన, మాన, ప్రాణాలను పణంగా పెట్టి దేశానికి స్వాతంత్ర్యం సాధించారని తెలిపారు. కాంగ్రెస్ కార్యాలయం రాజీవ్ భవన్ ఇన్‌చార్జి చిన్నంశెట్టి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా గాంధీ బాలికలకు ఆకలి కేకలు!

మెనూ పాటించని ఎస్ఓ

మెనుపై బాలికలు పెదవి విప్పితే ఆగ్రహం

విశాలాంధ్ర-ఎ.కొండూరు : మండల కేంద్రమైన ఎ.కొండూరు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో బాలికలకు మెనూ ప్రకారం భోజనం వడ్డించడం లేదని, బాలికల తల్లిదండ్రులు ఆరోపించారు. నాణ్యతా ప్రమాణాలతో కూడిన భోజనం,విద్య, మౌలిక సదుపాయాలను బాలికలకు అందించాలని కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలుపరుస్తుంటే, ఎ. కొండూరు కేజీబీవీలో ఎస్ఓ నిర్లక్ష్య వైఖరితో బాలికలకు మెనూ ప్రకారం భోజనం అందక ఆకలి కేకలతో అలమటిస్తున్నారని తల్లిదండ్రులు ఆరోపించారు. బాలికలకు వడ్డించే భోజనం మెనూ ప్రకారం వడ్డించకుండా అధికారులు వారి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని మండల ప్రాంత బాలికల తల్లి తండ్రులు ఆరోపణలు ఆరోపించారు. ఈ పాఠశాల కళాశాలలో 6వ తరగతి నుండి 12వ తరగతి వరకు 250 మంది బాలికలు విద్యను అభ్యసిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం బాలికలకు భోజనం మెనూ ప్రకారం వడ్డించకుండా కాసులకు కక్కుర్తిపడి భోజనం సక్రమంగా వడ్డించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆదివారం పిల్లలకు మెనూ

ప్రకారం 100 గ్రాములు చొప్పున 25 కేజీల చికెన్ పెట్టాల్సి ఉండగా క్యాబేజీ కూరతో సరిపెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశ్నించిన బాలికలను మందలిస్తూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. మూడు నాలుగు నెలల కాలంలో జేసీ, ఆర్డీవో, జిసిడిఓ, తహసీల్దార్ కేజీబీవిలో ఆకస్మికంగా తనిఖీ చేసిన సందర్భంలో మెనూ ప్రకారం భోజనం లేకపోవడంతో ఎస్ఓను పద్ధతి మార్చుకొని ప్రభుత్వ నిబంధనల ప్రకారం బాలికలకు భోజనం వడ్డించాలని, అధికారులు మందలించారు.

అయితే ఎస్ఓ పనితీరు మాత్రం మారడం లేదని విద్యార్థినీ తల్లి తండ్రులు బహిరంగగానే ఆరోపిస్తున్నారు. పాఠశాల కళాశాలలో టాయిలెట్స్ పరిశుభ్రంగా ఉండటం లేదని కొందరు బాలికలు ఆరోపించారు. సంక్షేమ హాస్టళ్లకు పిల్లలను పంపేది సరైన విద్య, మంచి పోషకాహారం అందుతుందనే ఆశతో తమ పిల్లను ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో చదివించకుండా కేజీబీవీ పాఠశాలల్లో చేరుస్తున్నామని తెలిపారు. బాలికల తల్లి తండ్రులు తమ పిల్లలకు మెనూ ప్రకారం భోజనం వడ్డించమని అడిగినందుకు ఎస్ ఓ తన ఇష్టానుసారంగా మాట్లాడుతుందని తల్లి తండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కస్తూర్బా గాంధీ పాఠశాల కళాశాల లో జరుగుతున్న పరిణామాలపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని బాలికల తల్లిదండ్రులు తల్లిదండ్రులు ప్రజా సంఘాలు నాయకులు కోరారు. జిల్లా స్థాయిలో సంక్షేమ హాస్టల్‌లపై నిఘా ఉంచాల్సిన కొందరు అధికారులు మామూళ్ల మత్తులో జోగుతూ ఉండటంతో బాలికలకు సరైన భోజనం పెట్టడం లేదనే ఆరోపణలు బాలికల తల్లిదండ్రుల నుండి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి వెంటనే ఎ. కొండూరు కేజీబీవీ ఎస్ఓపై శాఖా పరమైన చర్యలు తీసుకొని, బాలికలకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం వడ్డించాలని బాలికల తల్లిదండ్రులు ముక్తకంఠంతో విజ్ఞప్తి చేస్తున్నారు.

రంగనాయకస్వామి గరుడ వాహన సేవ

విశాలాంధ్ర-జగ్గయ్యపేట : పట్టణంలోని రంగనాయక స్వామి ఆలయంలో స్వామి అమ్మ వార్లకు గరుడ వాహన సేవ సాంప్రదాయంగా జరిగింది. ఆదివారం పట్టణంలోని శ్రీదేవి భూదేవి సమేత రంగనాయక స్వామివారి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా విశేష పూజలు అభిషేకాలు ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి రామకృష్ణమాచార్యులు నిర్వహించారు. జగ్గయ్యపేట మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు దంపతులు స్వామి వారి గరుడ వాహన సేవ కు కావలసిన పూజా సామాగ్రి గజమాలలు ప్రసాదాలను అందజేశారు. నూతన వస్త్రాలను మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు దంపతులు అందజేశారు. గరుడోత్సవం అనంతరం స్వామి అమ్మవార్లకు కర్పూర హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

హైకోర్టు న్యాయవాది అన్వర్‌కు కరాటేలో బ్లాక్ బెల్ట్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాది డాక్టర్ అన్వర్ షేక్‌కు కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ -2025లో ప్రతిష్ఠాత్మక బ్లాక్ బెల్ట్, బ్లాక్ బెల్ట్ డిప్లొమా ప్రదానం చేయడం న్యాయ వృత్తి , కరాటే రంగాలకు గర్వకారణంగా నిలిచిందని ఆయనను పలువురు కరాటే మాస్టర్లు సత్కరించి అభినందించారు. విజయవాడ విద్యాధరపురం చెరువు సెంటర్ ప్రాంతానికి చెందిన అన్వర్ షేక్ అటు న్యాయవాద వృత్తిలో ,ఇటు కరాటే రంగంలోనూ రాణిస్తున్నారు. కాగా ఆదివారం జరిగిన ఈ సన్మాన కార్యక్రమాన్ని జే.కే. గోజు ర్యూ కరాటే అకాడమీ స్థాపకుడు శిహాన్ జె. శ్రీనివాసులు నిర్వహించగా, జే. హరినాథ్ ఎగ్జామినర్‌గా, టెక్నికల్ డైరెక్టర్‌గా వ్యవహరించారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక : కలెక్టర్

విశాలాంధ్ర-విజయవాడ: ఈ నెల 29వ తేదీ కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుండి వినతులు స్వీకరిస్తారని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కారానికి పీజీఆర్ఎస్ ద్వారా అర్జీల స్వీకరణ చేపట్టనున్నట్లు తెలిపారు. కలెక్టరేట్, డివిజన్, మునిసిపల్, మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. అదేవిధంగా అర్జీదారులు తమ అర్జీలను వెబ్ సైట్‌లో నమోదు చేసుకోవచ్చని నమోదైన అర్జీల స్థితి, సంబంధిత సమాచారం తెలుసుకునేందుకు 1100కి నేరుగా కాల్ చేయవచ్చన్నారు.

మధ్య తరగతి విద్యాదీపం 'కేబీఎన్' : ఎంపీ

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): పేద, మధ్య తరగతి ప్రజలకు ఉత్తమ విద్యావకాశాలు కల్పించాలనే సమున్నత ఆశయంతో స్థాపించిన విద్యాసంస్థ కేబీఎన్ కాలేజీ అని పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. కేబీఎన్ కళాశాల పూర్వవిద్యార్థుల సంఘం (కోసా) ఆదివారం ఆనందోత్సాహాల మధ్య అత్యంత వేడుకగా జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న శివనాథ్ మాట్లాడుతూ 60 ఏళ్ళ వేడుక చేసుకుంటున్న కేబీఎన్ కాలేజీ పూర్వవిద్యార్థులు వేలాదిగా దేశ విదేశాల్లో స్థిరపడ్డారన్నారు. చంద్రయాన్ ప్రయోగంలో కీలకమైన విడిభాగాలు తయారుచేసిన బి.ఎన్.రెడ్డి వంటి ప్రముఖుల ద్వారా కాలేజీ కీర్తి ఖండాంతరాలు దాటి వ్యాపించిందన్నారు. తాను ఇక్కడ చదువుకోకపోయినా, కెబిఎన్ కాలేజీ తన సొంత కాలేజీ అనే భావన కలుగుతుందన్నారు. పూర్వ విద్యార్థులందరూ కాలేజీ అభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు. మరో మూడు నెలల్లో కాలేజీలో స్కిల్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. టాలీవుడ్ నటుడు, కాలేజీ పూర్వవిద్యార్థి సుహాస్ మాట్లాడుతూ కెబిఎన్ కాలేజీ నేర్పించిన క్రమశిక్షణ, చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో ఇచ్చిన ప్రోత్సాహం వల్లనే సినీ రంగంలో తాను నిలదొక్కుకోవటం సాధ్యమైందన్నారు. సీనియర్ ఐ ఎఫ్ ఎస్ అధికారి జె.ఎ.సి.ఎస్.రావు మాట్లాడుతూ తన చదువుకు అడ్డంకి ఏర్పడిన పరిస్థితుల్లో కెబిఎన్ కాలేజీ అధ్యాపకులు ఇచ్చిన ప్రోత్సాహంతో చదువు పూర్తిచేసి, ప్రస్తుతం సివిల్ సర్వీస్ అధికారిగా ఉన్నట్లు చెప్పారు. మాజీ డి ఎస్ పి అశోక్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ తనలోని క్రీడాసక్తిని ఇక్కడి అధ్యాపకులు గుర్తించి ప్రోత్సహించడం వల్లే స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధించి, అంచలంచెలుగా ఎదిగి పోలీసు శాఖలో ఉన్నతాధికారి స్థాయికి చేరుకోగలిగినట్లు చెప్పారు. ఎస్ కె పి వి వి హిందూ హై స్కూల్స్ కమిటీ జనరల్ సెక్రటరీ గోపిశెట్టి మల్లయ్య మాట్లాడుతూ తాను కూడా ఈ కళాశాల విద్యార్థినే అని, ఇక్కడే చదువుకుని, ఇక్కడ

సంస్థలకు జనరల్ సెక్రటరీ కావటం తన అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ పూర్వవిద్యార్థులు కాలేజీ సంపదగా అభివర్ణించారు. సెక్రటరీ డాక్టర్ టి.శ్రీనివాసు మాట్లాడుతూ కాలేజీ అభివృద్ధిలో పూర్వవిద్యార్థుల సహకారం మరువలేనిదన్నారు. హిందూ హై స్కూల్స్ పరిపాలనాధికారి డాక్టర్ వి.నారాయణరావు మొత్తం కార్యక్రమాన్ని నిర్వహించారు. విశ్రాంత అధ్యాపకులు, ప్రముఖ పూర్వ విద్యార్థులను ఎంపి కేశినేని శివనాథ్ సత్కరించారు.కేబీఎన్ కాలేజీ వైస్ ప్రెసిడెంట్ చిట్టూరి నాగేంద్ర, ప్రెసిడెంట్ ఉసిరిక ఉమా మహేశ్వరరావు, ప్రముఖ పూర్వ విద్యార్థులు రమేష్ బాబు (సి ఈ ఓ, సి ఛానెల్), డాక్టర్ ఆర్.కె. అయోధ్య (ప్రముఖ సైకాలజిస్ట్), జె.ఎ.సి.ఎస్.రావు (ఐ ఎఫ్ ఎస్ అధికారి, ఛత్తీస్ ఘడ్), నందిపాటి శ్రీనివాసరావు (ప్రముఖ న్యాయవాది) తదితరులు పాల్గొన్నారు.

కృష్ణానదిలో పడి ఒకరి మృతి

విశాలాంధ్ర-కంచిక చర్ల: కంచికచర్ల మం డలం చెవిటికలు గ్రామా నికి చెందిన మాలది నందయ్యా వెంకయ్య (70) ఈ నెల 25న ఇంటి నుంచి పనికి వెళ్లినట్లు ఉదయం చెవిటికల్లు గ్రామంలోని కృష్ణ నదిలో పడి మృతి చెందినట్లు మృతుడి కుమారుడు సురేంద్ర ఇచ్చిన పిర్యాదు మేరకు కంచికచర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడి పందేల స్థావరాలపై దాడి

9 బైకులు స్వాధీనం

విశాలాంధ్ర-కంచికచర్ల : మండలంలోని గండేపల్లి గ్రామ శివారు వద్ద మామిడి తోటలో ఆదివారం కోడి పందెలు వేస్తున్న 7 గురు వ్యక్తులు వద్ద నుంచి 8300 రూపాయలు నగదు, 3 కోడి పుంజులు మరియు 9 బైక్ లను స్వాధీన పరుచుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చదువుతోనే విజయాలు సాధించవచ్చు

సంక్షేమ హాస్టళ్ళ విద్యార్థులతో సంక్షేమ బోర్డు చైర్మన్ బాలకోటయ్య

విశాలాంధ్ర-విజయవాడ: చదువుతోనే సమాజంలోని అన్ని రంగాల్లో విజయాలు సాధించవచ్చని, చదువు మూడో కన్ను వంటిదని ఆంధ్రప్రదేశ్ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పోతుల బాలకోటయ్య హితవు పలికారు. ఆదివారం సంక్షేమ హాస్టళ్ళ తనిఖీల్లో భాగంగా పెనమలూరు సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్, ఈడుపుగల్లు బాలుర కళాశాల హాస్టల్‌ను ఆయన సందర్శించారు. విద్యార్థులతో వసతి, భోజనం, పరిశుభ్రత, భద్రత వంటి అంశాలపై ఆరా తీశారు. విద్యార్థులు శానిటేషన్ వర్కర్లు, ఆరో ప్లాంట్స్, పరుపులు, కాస్మోటిక్స్ అంశాలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. రాష్ట్రంలో దాదాపు 1,300 మందికి శానిటైజేషన్ సిబ్బందిని నియమించేందుకు ప్రభుత్వం జీవో ఇచ్చిందని, త్వరలోనే అన్ని హాస్టళ్ళల్లో వారిని నియమిస్తారని చెప్పారు. ఆర్వో ప్లాంట్స్‌పై కూడా కసరత్తు చేస్తోందని, త్వరలోనే ఏర్పాటు చేస్తారని హామీ ఇచ్చారు. కాస్మోటిక్ కిట్స్, పడుకునేందుకు పరుపులు అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి నున్నట్లు చెప్పారు. పెనమలూరు బాలికల హాస్టల్‌లో కొంతమంది విద్యార్థులు హాస్టల్ సమీపంలో మందు బాబులు కూర్చొని మందు తాగుతున్నట్లు ఫిర్యాదు చేశారు. పోలీసులతో మాట్లాడి మందుబాబుల సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ప్రతి ఒక్క విద్యార్థి ముస్తాబు కార్యక్రమంలో పాల్గొని పరిశుభ్రంగా ఉండాలని, అలా ఉంటేనే, దేహానికి, మానసిక మేధస్సుకు బాగుంటుందని పేర్కొన్నారు. ఇబ్బందులు ఉన్నా చదువులో రాణిస్తేనే కన్న తల్లిదండ్రుల ఆశలు నెరవేరుస్తారని బాలకోటయ్య స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఈడుపుగల్లు గ్రామస్తులు సుధాకర్, అబ్దుల్ సలాం వార్డెన్ ధనలక్ష్మి పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): చలిలో బాధపడుతున్న యాచకులకు, పేదలకు, నిరాశ్రయులకు మానవతా దృక్పథంతో ప్రతి సంవత్సరం దుప్పట్లు పంపిణీలి చేయటం ఆనందదాయకం అని ఎక్స్ రే సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి బోడి ఆంజనేయ రాజు అన్నారు. ఆదివారం సాయంత్రం ఎక్స్ రే నిర్వహణలో ఘంటసాల సంగీత కళాశాల దగ్గర, బిఆర్టిఎస్ రోడ్ లో ఉచిత దుప్పట్ల పంపిణీలి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం ప్రారంభిస్తూ అంజనేయ రాజు మాట్లాడుతూ సమాజ సేవకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని అన్నారు. సమాజంలో మంచి మార్పును ఆశిస్తూ రచనలు చేసే కవులు, కళాకారులు కలిసి ఇటువంటి సేవలు అందించడం అభినందనీయమని అన్నారు. డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్ మాట్లాడుతూ ఫుట్ పాత్ లపై జీవనం గడుపుతున్న నిరాశ్రయులకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. ఎక్స్ రే సంస్థ కోశాధికారి చామర్తి వెంకట సుబ్బయ్య తమ సంస్థ అధ్యక్షులు దివంగత కొల్లూరి స్ఫూర్తితో భవిష్యలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామన్నారు. కన్వీనర్ కొల్లా జయశ్రీ మాట్లాడుతూ తోటివారికి సహాయపడుతూ అందరూ బాగుండాలనే లక్ష్యంతో సేవ చేయాలన్నారు. సంస్థ సభ్యులు రోడ్డు ప్రక్క చలిలో వణుకుతూ నిదురిస్తున్న వారికి దుప్పట్లు కప్పుతూ బిఆర్టిఎస్ రోడ్, శారదా కళాశాల, మీసాల రాజారావు వంతెన, పెజ్జోనిపేట తదితర ప్రాంతాల్లో తిరిగారు. విపరీతమైన చలిలో కూడా సభ్యులు ఆనందంగా దుప్పట్లు పంచడం ప్రశంసనీయం. ఈ సేవాకార్యక్రమంలో సంస్థ సంయుక్త కార్యదర్శి గుర్రం ఏడుకొండలు, గంటేడి సుజాత, అడిదం ఉషాకుమారి, కెకె రావు, జి లీలా శ్రీనివాస్, పరిమి భాస్కరశర్మ, జి లీలాకుమార్, సాయిచంద్ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ముగిసిన యేసుక్రీస్తు జయంతి 2025 జూబ్లీ వేడుకలు

విశ్వకథోలిక శ్రీసభలో ఈ వేడుకలు నూతన అధ్యాయానికి నాంది.. బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు

విశాలాంధ్ర - విజయవాడ ఎడ్యుకేషన్: విశ్వవ్యాప్త కథోలిక శ్రీసభలో యేసుక్రీస్తు జయంతి 2025 జూబిలీ ముగింపు వేడుకలు నూతన అధ్యాయానికి నాంది పలుకుతూ, చారిత్రాత్మక ఘట్టంగా మిగిలిపోతాయని విజయవాడ కేథలిక్ దయోసిస్ (విజయవాడ కథోలిక మేత్రాసనం) మోస్ట్ రెవ.బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు ఉద్ఘాటించారు. బెంజిసర్కిల్ సమీపంలోని పటమట నిర్మలా హైస్కూల్ పక్కన ప్రఖ్యాతిగాంచిన సెయింట్ పాల్స్ కథెడ్రల్లో ఆదివారం సాయంత్రం జరిగిన యేసుక్రీస్తు జయంతి 2025 జూబిలీ ముగింపు వేడుకలలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిషప్ జోసఫ్ రాజారావు దైవ సందేశమిస్తూ విశ్వశాంతి దూత దివంగత పోప్ ఫ్రాన్సిస్ వారు 2025 సంవత్సరాన్ని యేసుక్రీస్తు జయంతి 2025 జూబిలీ వేడుకలుగా ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. విజయవాడ కథోలిక పీఠం మోన్సిన్యోర్, సెయింట్ పాల్స్ కథెడ్రల్ విచారణ కర్తలు రెవ. ఫాదర్ మువ్వల ప్రసాద్ మాట్లాడుతూ కథోలిక తెలుగు శ్రీసభకు యువతీ యువకులు ముఖ్యభూమిక పోషిస్తూ సమైక్యతను చాటిచెప్పే విధంగా ముందుకు సాగాలన్నారు. విజయవాడ కథోలిక పీఠం వికార్ జనరల్ రెవ.ఫాదర్ యం. గాబ్రియేలు మాట్లాడుతూ నవంబర్ 8వ తేదీన ఆంధ్ర లయోలా కళాశాలలో విశాఖపట్నం అగ్రపీఠం పరిధిలోని ఆరు కేథలిక్ దయోసిస్లు ఒకే వేదిక మీదకు వచ్చి అందుకు విజయవాడ కథోలిక పీఠం యేసుక్రీస్తు జయంతి 2025 జూబిలీ ప్రారంభ వేడుకలను కన్నులపండుగగా నిర్వహించి ఘనతకెక్కిందన్నారు. అనంతరం సెయింట్ పాల్స్ కథెడ్రల్ లో శోభాయమానంగా

అలంకరించిన పవిత్ర పూజాపీఠంపై పీఠాధిపతులు (బిషప్) తెలగతోటి జోసఫ్ రాజారావు, మోన్సిన్యోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, వికార్ జనరల్ ఫాదర్ యం. గాబ్రియేలు, ప్రొక్యురేటర్ ఫాదర్ కిరణ్ తదితర దయోసిస్ గురువులు క్రీస్తు జయంతి 2025 జూబిలీ ముగింపు సమిష్టి దివ్యపూజాబలి సమర్పించారు. అంతకుముందు బిషప్ జోసఫ్ రాజారావు, మోన్సిన్యోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, వికార్ జనరల్ ఫాదర్ యం. గాబ్రియేల్ తదితర గురువులు యేసుక్రీస్తు జయంతి 2025 జూబిలీ క్రీస్తు శిలువను ప్రదర్శించారు. ఈ పోలు కార్యక్రమంలో గుణదలమాత పుణ్యక్షేత్రం రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు స్వామి, ఎడ్యుకేషన్ సొసైటీ డైరెక్టర్ ఫాదర్ కొలకాని మరియన్న, ఫాదర్ పి.కె. జోసఫ్, ఎస్ఎస్సి డైరెక్టర్ ఫాదర్ తోట సునీల్ రాజు, సెక్రటరీ ఫాదర్ వినోద్, దయోసిస్ గురువులు, మఠకన్యలు, కతోలిక విశ్వాసులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర -పమిడిముక్కల: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవటమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. ఆదివారం హనుమంతపురంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మట్టా శాంతి, పలగాని మహాలక్ష్మి, పోరంకి నాగమణి లకు మొత్తం రూ.120772 లక్షల చెక్కులను ఇంటికి వెళ్లి లబ్ధిదారులకు అందజేశారు ఈ కార్యక్రమంలో లింగమనేని బాబురావు యండూరి పిచ్చేశ్వర రావు రాజులపాటి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర గుంటూరు జిల్లా

కోలా సీతారామయ్యకు సీపీఐ నాయకుల నివాళి

విశాలాంధ్ర-మంగళగిరి : ఇందిరానగర్‌లో ఆదివారం సీపీఐ సీనియర్ నాయకులు కోలా సీతారామయ్య ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి సీపీఐ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య మాట్లాడుతూ కోలా సీతారామయ్య పేదల పక్షాన నిలబడి జీవితాంతం ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితమైన కమ్యూనిస్టు నాయకుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య, పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్, పట్టణ సహాయ కార్యదర్శి నందం బ్రహ్మేశ్వరరావు, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు, ఇందిరానగర్ శాఖ కార్యదర్శి గోలి వెంకటేశ్వరరావు, ఉడత శ్రీనివాసరావు, సీపీఎం పట్టణ కార్యదర్శి వీవీ జవహర్ లాల్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర-తాడేపల్లి : కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం వడ్డేశ్వరం ఇందిరా గాంధీ విగ్రహం ముందు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ షేక్ సలీం ఆధ్వర్యంలో జండాను ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నిరంతరం పేదల పక్షాన పోరాటం చేస్తుందని అన్నారు. దేశ స్వతంత్ర ఉద్యమంలో కాంగ్రెస్ పార్టీ కీలక పాత్ర పోషించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాం నుంచి అమలవుతున్న మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని కుట్రపూరితంగా బీజేపీ ప్రభుత్వం రద్దు చేసి జీ రామ్ జీ పేరుతో కొత్త చట్టాన్ని తీసుకువచ్చే యత్నం దేశ ప్రజాస్వామ్య, రాజ్యాంగ, పౌర హక్కులకు తీవ్ర ముప్పు పొంచి ఉందని అన్నారు. బీజేపీ కుట్రలను భగ్నం చేసి ఉపాధి చట్టాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో రామనాదం పూర్ణ చంద్రరరావు, రేమిడిశెట్టి హనుమంతరావు, షేక్ మున్ని, కోప్పకుల కృష్ణ చౌదరి, పఠాన్ సుభాని, దర్శనపు శ్యామ్యూల్, షేక్ జల్సా, బుల్లా సమర్పణ కుమార్, షేక్ జెల్సి పాల్గొన్నారు.

ప్రేక్షకుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన సావిత్రి

విశాలాంధ్ర-తాడేపల్లి : సినీ నటి, దర్శకురాలు, అభిమానుల చేత మహానటిగా గొప్ప కీర్తిని పొందిన సావిత్రి వర్ధంతి సందర్భంగా శనివారం రాత్రి తాడేపల్లి బైపాస్ రోడ్డులోని నారా లోకేష్ క్రీడా ప్రాంగణంలో సావిత్రి సంస్మరణ సభ జరిగింది. ఈ సభకు నల్లిబోయిన శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ మాట్లాడుతూ అలనాటి అందాల సినీ తార సావిత్రిని తెలుగు వారితో పాటు తమిళనాట ఎంతో ప్రేమతో, గౌరవంతో ఆదరించారని అన్నారు. సావిత్రి తన నటనా కౌశల్యం, మంచి మనసుతో తెలుగువారి గుండెల్లో సుస్థిరస్థానం సంపాదించుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ముమ్మిడి సత్యనారాయణ, అరవపల్లి శ్రీనివాసరావు, టంకశాల ఈశ్వర్ నాయుడు, కోగంటి ప్రసాద్, కోగంటి వెంకటేశ్వరావు, పుల్లెపు భాస్కరరావు, కాసారగడ్డ శ్రీనివాసరావు, ఇట్టా భాస్కర్, తోట సాంబశివరావు, మండవ గోపాలరావు, అడపా నరేష్, నక్కా నవీన్ రాజా, అనిల్, బొర్రా కృష్ణా వందన, అన్నెం కుసుమ, కుటుంబ సభ్యులు దావులూరి అనిల్, చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బాలికలకు హెచ్‌పీవీ టీకా

విశాలాంధ్ర-తాడేపల్లి : గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నుంచి బాలికలను రక్షించే ఉద్దేశంతో రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి ఆధ్వర్యంలో ఉచితంగా హెచ్‌పీవీ టీకాలు వేయనున్నట్లు అధ్యక్షులు శెట్టి రామకృష్ణ తెలిపారు. వడ్డేశ్వరం దీపక ప్రాంగణంలో బ్రౌచర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ, మున్సిపల్, ఎయిడెడ్, జిల్లా పరిషత్, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న 9 నుంచి 15 సంవత్సరాల లోపు బాలికలకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నుంచి రక్షణ కల్పించే క్వాడ్రివాలెంట్ హెచ్‌పీవీ టీకాలను 2026 జనవరి 7,8,9 తేదీలలో ఒక రోజు ఉచితంగా వేయనున్నట్లు తెలిపారు. ప్రాజెక్ట్ చైర్మన్ జంగాల వెంకటేష్ మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వే ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ప్రతి 9 నిమిషాలకు ఒక మహిళ గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ కారణంగా ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. ఈ ప్రమాదకర వ్యాధి నివారణకు రెండు మోతాదులుగా హెచ్‌పీవీ టీకాను తీసుకోవాలని అన్నారు. ఈ నెల 31వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, తల్లిదండ్రుల నుంచి అంగీకార పత్రం తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. వివరాలకు 9948074365, 9703934444, 9032331199, 8466812222లలో సంప్రదించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి పాస్ట్ ప్రెసిడెంట్ మున్నంగి వివేకానంద రెడ్డి, ప్రెసిడెంట్ ఎలక్ట్ కాట్రగడ్డ శివన్నారాయణ, బోర్డు సభ్యులు శెట్టి కేశవ రావు, పలగాని శ్రీకాంత్, ఉండేల చంద్ర ఓబులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంతోనే దేశం సుభిక్షం

విశాలాంధ్ర-వట్టిచెరుకూరు: దేశం సుభిక్షంగా ఉండాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలని, రాహుల్ గాంధీ ప్రధాని కావాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు చిలకా విజయ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం కార్యాలయంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రతి మూల కాంగ్రెస్ పార్టీ జ్ఞాపకాలు ఉన్నాయని, కాంగ్రెస్ అంటే భారతదేశం... భారతదేశం అంటే కాంగ్రెస్ అని అన్నారు. వచ్చే ఆవిర్భావ దినోత్సవం నాటికి జిల్లా పరిధిలోని కాంగ్రెస్ పార్టీ మహనీయుల విగ్రహాలకు మరమత్తులు చేయించి రంగులు వేయించి, గ్రామగ్రామానా కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ చేస్తామన్నారు. దీనికోసం జిల్లా పార్టీ ఏడుగురు సభ్యులతో కమిటీని త్వరలో నియమిస్తామని విజయ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు, బిళ్ళా సునీల్, రాచకొండ జాన్ బాబు, గడ్డం పాల్ విజయ్ కుమార్, బొట్ల బ్రహ్మయ్య, సయ్యద్ జబీలుల్లా, యన్నం సుధీర్, వాల్మీకి శ్రీనివాస్‌రావు, షేక్ ఇంతియాజ్, ఆడుసుమల్లి శ్రీనివాస్‌రావు, షేక్ బాషా, షేక్ బాషా, కంతేటి యలమంద, షేక్ జాఫర్, షేక్ బాబు, షేక్ కమలుద్దీన్, షేక్ కథర్, కావూరి పరిశుద్ధరావు, గౌస్య తదితరులు పాల్గొన్నారు.

కుర్రా అప్పారావును సత్కరించిన బుజ్జి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా ఇటీవల నియమితులైన కుర్రా అప్పారావును పెదకూరపాడు మాజీ ఎంపీపీ బుజ్జి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం బుజ్జి మాట్లాడుతూ టీడీపీలో కష్టపడి పని చేస్తున్న అప్పారావుకు మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవి వరించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కుర్రా అప్పారావు భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. వట్టికూటి శివరామ కృష్ణయ్య, మన్నెం శ్రీనివాసరావు, ఆర్‌పి రమేష్, వట్టికూటి సైదారావు, సాంబిరెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

'మన మిత్ర' వాట్సాప్ గవర్నెన్స్‌తో పోలీస్ సేవలు: ఎస్పీ

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : 'మన మిత్ర' వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా సులభంగా పోలీస్ సేవలు పొందవచ్చని గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన, సులభమైన సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రవేశపెట్టిన 'మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్' కార్యక్రమాన్ని జిల్లా పోలీస్ శాఖ సమర్థవంతంగా అమలు చేస్తోందని ఎస్పీ తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇంటి నుంచే అనేక సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు.

తాగునీటి సమస్య నివారణకు చర్యలు: మంత్రి

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: నగరంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో ఈ.ఎల్.ఎస్.ఆర్‌ల నిర్మాణం చేపడుతున్నామని కేంద్ర గ్రామీణాభివృద్ధి మరియు కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలోని బి.ఆర్ స్టేడియం నందు రూ.4.60 కోట్ల ఖర్చుతో 1590 కిలో లీటర్ల సామర్థ్యం కలిగిన ఈ.ఎల్.ఎస్.ఆర్ (ఎక్సిస్టింగ్ ఎలివేటెడ్ లెవెల్ సర్వీస్ రిజర్వాయర్) నిర్మాణానికి, హౌసింగ్ బోర్డు కాలనీలో 1 కోటి రూపాయల వ్యయంతో అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మించడానికి కలెక్టర్ తమీమ్ అన్సారియా, మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్యే గళ్లా మాధవి, మొహమ్మద్ నసీర్ తదితరులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ, ఆదివారం తాగు నీటి సరఫరా మెరుగుదలకు ఈ.ఎల్.ఎస్.ఆర్, మెరుగైన ఆరోగ్యం అందించేందుకు యు.పి.హెచ్.సిల నిర్మాణాలకు శంకుస్థాపన చేశామన్నారు. గతంలో నిర్మాణం జరిగిన ఈ.ఎల్.ఎస్.ఆర్‌లు రూఫ్ తక్కువ మందంతో ఉండటం, ఫ్లస్టింగ్ చేయకపోవడం వలన నగరంలోని ఎక్కువ ఈ.ఎల్.ఎస్.ఆర్‌లు మరమ్మతులకు గురయ్యాయన్నారు. ప్రస్తుతం నిర్మించే ఈ.ఎల్.ఎస్.ఆర్‌లు 15 సెంటీమీటర్ల మందంతో రూఫ్, ఇన్సైడ్ ప్లాసింగ్‌లతో 50 ఏళ్ల వరకు చెక్కు చెదర కుండా ఉండేలా నిర్మాణం చేయనున్నామన్నారు. కాంట్రాక్టర్లు టెండర్ కంటే తక్కువ అమౌంట్ కోడ్ చేసి, నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించుట లేదని గమనించుట జరిగిందని, అధికారులు నిరంతర పర్యవేక్షణ చేసి నాణ్యత పాటించేలా చూడాలన్నారు. శాసనసభ్యులు గళ్లా మాధవి చొరవతో నూతన యు.పి.హెచ్.సి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, ఈ నిర్మాణం వలన సదరు ప్రాంత ప్రజలకు ఆరోగ్య వసతి మెరుగవుతుందన్నారు. ఎ.పి.ఐ.డి.సి చైర్మన్ డేగల ప్రభాకర్, లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యాల రావు, ఎ.పి.హాజ్ కమిటీ చైర్మన్ షేక్ హసన్ బాషా, డిప్యూటీ మేయర్ షేక్ సజీల, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్‌ఎస్‌లో రెవెన్యూ క్లినిక్: కలెక్టర్

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్)లో సోమవారం నుండి 'రెవెన్యూ క్లినిక్' నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ రెవెన్యూ సమస్యలకు త్వరితగతిన పరిష్కారం అందించేందుకు ఈ నెల 29వ తేదీ సోమవారం కలెక్టర్ కార్యాలయం ఆవరణలో ఎస్.ఆర్ శంకరన్ సమావేశ మందిరం వద్ద జిల్లా స్థాయి రెవెన్యూ క్లినిక్స్ నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. సోమవారం నిర్వహించే రెవిన్యూ క్లినిక్‌లలో జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్లు, గుంటూరు రెవిన్యూ డివిజనల్ అధికారి, తెనాలి సబ్ కలెక్టర్ గ్రామ స్థాయి రికార్డులతో హాజరు అవుతారని తెలిపారు. మండలాల వారీగా కౌంటర్లు ఏర్పాటు చేశారని చెప్పారు. రెవెన్యూ క్లినిక్స్ ఏర్పాటు చేసి, ప్రజల నుంచి అర్జీలను నేరుగా స్వీకరించి నమోదు చేయడంతో పాటు, సమస్యల స్వరూపాన్ని బట్టి అక్కడికక్కడే పరిష్కార చర్యలు చేపడతామని తెలిపారు. అప్పటికప్పుడే పరిష్కారం చేయలేని సమస్యలను వారం రోజులలో పరిష్కారం చేయుటకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను డివిజనల్, మండల రెవిన్యూ అధికారులు సమర్పిస్తామని వివరించారు. రెవెన్యూ, అడంగల్ సవరణలు, 22ఎ చుక్కల భూముల క్రమబద్ధీకరణ, అసైన్డ్ భూములు-భూ ఆక్రమణలు, రెవెన్యూ కోర్టు కేసులు, సర్వే-రీ సర్వే, దేవాదాయ-వక్ఫ్ భూముల సమస్యలకు ప్రత్యేక కౌంటర్ల ద్వారా ప్రజల అర్జీలకు వేగవంతమైన పరిష్కారం అందిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

హత్యా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ

విశాలాంధ్ర-వట్టిచెరుకూరు : చేబ్రోలు పోలీస్ స్టేషన్ పరిధిలోని నారాకోడూరు గ్రామ శివారులో శనివారం రాత్రి జరిగిన హత్య సంఘటన స్థలాన్ని గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదివారం స్వయంగా పరిశీలించారు. ఘటనకు సంబంధించిన వివరాలను అక్కడి సంబంధిత పోలీస్ అధికారుల నుంచి సేకరించారు. కేసు దర్యాప్తును వేగవంతం చేసి, నిందితులను త్వరితగతిన గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇటువంటి క్రూరమైన, చట్ట వ్యతిరేకమైన చర్యలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో తెనాలి డీఎస్పీ జనార్ధన్, ఎస్పీ డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్బీ సీఐ-1 అలహరి శ్రీనివాస్, చేబ్రోలు ఎస్సై వీరనారాయణ ఉన్నారు.

గీతా మందిరం చైర్మన్‌గా వెలుగూరి అభయశ్రీ రత్నప్రసాద్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : గీతా మందిరం చైర్మన్‌గా వెలుగూరి అభయశ్రీ రత్నప్రసాద్ మళ్ళీ నియమితులయ్యారు. ఈ మేరకు ఏపీ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ చేతుల మీదుగా ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఆర్యవైశ్య ప్రముఖుల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి.

గంజాయి నిర్మూలనే లక్ష్యం

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాల మేరకు గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల అక్రమ కార్యకలాపాలను పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో గత మూడు రోజులుగా జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు. ఈ తనిఖీల్లో భాగంగా అనుమానితులు, గంజాయి కేసులలో పాత నేరస్తులు, రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీట్లు కలిగిన వ్యక్తుల నివాసాలను పరిశీలించడంతో పాటు, చట్టవిరుద్ధ కార్యకలాపాలపై కఠినంగా వ్యవహరిస్తామని పోలీసులు హెచ్చరించారు. గంజాయి కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా గట్టి చర్యలు తప్పవని పాత నేరస్తులకు స్పష్టమైన హెచ్చరిక జారీ చేస్తున్నారు. రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. గుంటూరు వెస్ట్ డీఎస్పీ కె.అరవింద్ నేతృత్వంలో పట్టాభిపురం సీఐ వెంకటేశ్వర్లు, నగరంపాలెం సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో వెస్ట్ పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో గల మారుతి నగర్, తుఫాన్ నగర్ ప్రాంతాల్లో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. సరైన వాహన ధ్రువపత్రాలు లేని 30 ద్విచక్ర వాహనాలు, 1 ఆటోను సీజ్ చేయడంతో పాటు రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో జిల్లా అదనపు ఎస్పీ(అడ్మిన్) జీవీ రామమూర్తి స్వయంగా పాల్గొని తనిఖీలను పర్యవేక్షించారు. తుళ్లూరు డీఎస్పీ మురళీకృష్ణ నేతృత్వంలో ఫిరంగిపురం, తాడికొండ, తుళ్లూరు, తుళ్లూరు ట్రాఫిక్, మేడికొండూరు సీఐ బృందాలు మేడికొండూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని పేరేచర్ల ఎస్ఎస్ఎస్ కాలనీలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు.

పార్టీ బలోపేతానికి రాజకుమారి విశేష సేవలు చేయాలి: ఉమా శంకర్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు పార్లమెంట్ టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమితులైన డాక్టర్ శనక్కాయల రాజకుమారి పార్టీ బలోపేతానికి.. మహిళల అభివృద్ధికి విశేష కృషి చేయాలని ప్రముఖ సీనియర్ గైనకాలజిస్ట్, అహల్య ట్రస్ట్ డైరెక్టర్ డాక్టర్ ఉమా శంకర్ పేర్కొన్నారు. గుంటూరు పార్లమెంట్ టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమితులైన డాక్టర్ శనక్కాయల రాజకుమారిని హాస్పిటల్ ఆవరణలో డాక్టర్ ఉమా శంకర్ హాస్పిటల్ సిబ్బందితో కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాతో ఆదివారం ఘనంగా సత్కరించారు. అనంతరం డాక్టర్ ఉమా శంకర్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి అహల్య హాస్పిటల్ సిబ్బంది అందరూ కలిసికట్టుగా పార్టీ కార్యక్రమాలకు హాజరై సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. డాక్టర్ రాజకుమారి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి గుంటూరు పార్లమెంట్ టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి పదవిని అప్పగించిన పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుకి, అలాగే పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కి, కేంద్రమంత్రి, గుంటూరు పార్లమెంట్ సభ్యులు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌కి, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ వైద్యులు, నర్సులు, పరిపాలనా సిబ్బంది పాల్గొని డాక్టర్ రాజకుమారి గారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎమ్మెల్యే నసీర్‌ను కలిసిన మిర్చియార్డు చైర్మన్

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: గుంటూరు మార్కెట్ యార్డు (మిర్చి యార్డు) చైర్మన్ గా నూతనంగా నియమితులైన కుర్ర అప్పారావు ఆదివారం గుంటూరు తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కుర్ర అప్పారావు ను ఎమ్మెల్యే నసీర్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కేశవ్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను 'సంస్థ'లో కలపాలి

మేడా హనుమంతరావు

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను ఆర్టీసీ కార్పొరేషన్ సంస్థలో కలపాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక జిల్లా సీపీఐ కార్యాలయంలో వీసీకే సమావేశం మందిరంలో ఏపీఎస్‌ఆర్టీసీ (పీటీడీ) ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) గుంటూరు జిల్లా సమావేశం అవుట్‌సోర్సింగ్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పినపాటి సుధీర్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.గంగాజనేయులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమార్ నాయక్, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ప్రసాద్ కుమార్ తదితర ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈముఖ్య అతిథిగా హనుమంతరావు మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసి నందు వివిధ విభాగాల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ సమస్యలను విన్నవించారు. ప్రధానంగా ఆర్టీసి నందు కాంట్రాక్టు వ్యవస్థ వలన రోజు రోజుకు కార్మికులు చాలా ఇబ్బందులకు గురి అవుతున్నారన్నారు. యాజమాన్యం, లేబర్ డిపార్టుమెంటు నిర్ణయించిన జీతాలు రాష్ట్రంలో ఏ జిల్లాలో ఏ కార్మికుడు అందుకొని పరిస్థితులపై అధ్యయనం చేస్తూ, కాంట్రాక్ట్ వ్యవస్థను సమూలంగా రద్దు చేసి ప్రతి కార్మికుడికి యాజమాన్యం ద్వారా జీతాలు అందే విధంగా చేయాలని మొదలగు సమస్యల గురించి తెలిపారు. ప్రధానంగా ఆర్టీసి లో పనిచేస్తున్న సుమారు 8000 వేల మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్నారు. ఈ కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దుచేసి ఆర్టీసి మేనేజ్మెంటు ద్వారా డైరెక్టుగా బ్యాంకు అకౌంటు ద్వారా జీతాలు చెల్లించేలా చూడాలని, కార్పొరేషన్ ఎంప్లాయిస్‌గా పరిగణించాలని, విధుల్లో వుండే కార్మికుడికి ప్రమాదవశాత్తు ఏమైనా గాయపడితే స్థానిక ఆర్టీసీ డిస్పెన్సరి హాస్పటల్‌లో వైద్యం అందేవిధంగా యాజమాన్యం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో లేబర్ చట్టాల ప్రకారం ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ వారికి రావల్సిన హక్కులపై రాష్ట్ర వ్యాప్త ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ ధర్నాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్‌ఆర్టీసీ (పిటిడి) ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వెంకట్ కృష్ణ రావు, జిల్లా సెక్రటరీ ఇ.విజయ్ కుమార్, గుంటూరు జిల్లా అధ్యక్షుడు మోహన్, జిల్లా సెక్రటరీ రాజేష్, జిల్లా నాయకులు చక్రవర్తి, రాంబాబు, మల్లయ్య, జిల్లా మహిళా విభాగం నాయకురాలు జ్యోతి, పలు డిపోల కార్మికులతో పాటు నాయకులు పాల్గొన్నారు.

సీకే హైస్కూల్‌లో పరిమళించిన స్నేహ సౌరభం

విశాలాంధ్ర-మంగళగిరి : పట్టణంలోని చింతక్రింది కనకయ్య బాలుర ఉన్నత పాఠశాలలో 1999-2000లో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. 25 సంవత్సరాలు పూర్తి కావడంతో సిల్వర్ జూబ్లీ వేడుకలను వినూత్నంగా నిర్వహించారు. ఆనాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు పూర్వ విద్యార్థులు మధురానుభూతులను అందించారు. తొలుత వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాల నుంచి మేళతాళాలు, వేదమంత్రోచ్ఛరణల నడుమ పూర్ణకుంభంతో గురువులకు స్వాగతం పలికి... అక్కడి నుంచి సీకే హైస్కూల్ వరకు ప్రదర్శన నిర్వహించారు. సీకే హైస్కూల్‌లో విద్యా సంస్థల వ్యవస్థాపకులు స్వర్గీయ చింతక్రింది కనకయ్య విగ్రహానికి అలనాటి గురువులు, విద్యార్థులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సీకే హైస్కూల్ ఆడిటోరియంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. చిన్నారులచే ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. సీకే జూనియర్ కళాశాల పాలక మండలి అధ్యక్షులు చింతక్రింది కనకయ్య, సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ గంజి చిరంజీవి, ప్రిన్సిపాల్ అత్తోట రత్నబాబు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు దామర్ల కనకలింగేశ్వరరావు, ఆర్.సైదులు, గద్దె నరసింహారావు, జొన్నాదుల దేవేంద్రరావు, ఎం.రాజేంద్ర, జంజనం పాండురంగారావు, ఎన.గుణేశ్వరరావు, పంచల సాంబశివరావు, శనగల రామహనుమాన, తుమ్మా నాగేశ్వరరావు, జొన్నాదుల వెంకటేశ్వరరావు, ఎం.చలపతిరావు, దాసరి సాంబశివరావు, వై.రాజశేఖర్, సుబ్బారావు, నాన టీచింగ్ స్టాఫ్ చిరంజీవి, నాగేశ్వరరావులను ఘనంగా సన్మానించి పూల మొక్కలు, జ్ఞాపికలను అందజేశారు. ప్రస్తుత పాలకవర్గ ప్రతినిధులు, విశ్రాంత అధ్యాపకులు తమ అమూల్యమైన సందేశాలను అందించి పూర్వవిద్యార్థులను అభినందించారు. చిన్నానాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ రోజంతా ఆహ్లాదంగా, ఉత్సాహంగా గడిపారు. గురువులతో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ ఆప్యాయంగా పలుకరించారు. ఈ సమ్మేళనం సీకే విద్యా సంస్థల్లో పండుగ వాతావరణాన్ని నింపింది.

కేంద్ర మంత్రిని కలిసిన బండారు అశోక్ కుమార్

విశాలాంధ్ర-పెదకాకాని : గ్రామానికి చెందిన గత 20 సంవత్సరాలుగా ఐరోపాలో స్థిరపడిన ఎన్నారై కుటుంబం, బండారు అశోక్ కుమార్, జయలక్ష్మి ఆదివారం కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌ను కుంచనపల్లిలోని ఆయన నివాసంలో కలిశారు. దేశానికి, గుంటూరు నియోజకవర్గానికి ఆయన చేసిన అంకితమైన సేవకు, వేగవంతమైన అభివృద్ధికి అభినందనలు తెలిపారు. అశోక్‌కు ఐరోపా, యూఎస్‌ఏ నుంచి ఏఐ, లాట్, బ్లాక్‌చెయిన్, క్వాంటం, డిజిటల్ వంటి అధునాతన సాంకేతికతలలో విస్తృతమైన అనుభవం ఉంది. జయలక్ష్మికి రెడ్‌క్రాస్ ఐరోపాలో విస్తారమైన అనుభవం ఉంది. వారి సామాజిక సేవా లక్ష్యంతో, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వేలాది మంది కొత్త గ్రాడ్యుయేట్ సిబ్బంది తమ జీవితంలో స్థిరపడటానికి సహాయం చేయాలని వారు నిర్ణయించుకున్నారు. వారు కేంద్ర మంత్రితో చర్చించారు. యువ కొత్త గ్రాడ్యుయేట్‌లకు సరైన సహాయం అందించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వ్యక్తులు, కొత్త గ్రాడ్యుయేట్‌లు ఈ కాంటాక్ట్ నంబర్ 07842793787లో బండారు అశోక్‌ను సంప్రదించవచ్చునని తెలిపారు.

సీఓసీఎం ఆధ్వర్యంలో విద్యార్థులకు దుస్తులు పంపిణి



విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని ముత్యాలరెడ్డి నగర్‌లోని క్రైస్ట్ ఆర్ఫన్ సెంటర్ మినిస్ట్రీస్ (సిఓసీఎం) వ్యవస్థాపక అధ్యక్షులు మొరుగుల స్టీఫెన్ సుందర్ ఆధ్వర్యంలో ఆశ్రమ విద్యార్థులకు దుస్తులు..అలాగే క్రీస్తు సంఘం సభ్యురాళ్ళకు చీరల పంపిణీ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి గుంటూరు నగరపాలక సంస్థ 43వ డివిజన్ కార్పొరేటర్ కొమ్మినేని కోటేశ్వరరావు, ఏపీ ఉమెన్ అండ్ చైల్డ్ విభాగం లీగల్ అడ్వైజర్ మన్నం సుధాకర్ బాబు, నిడుముక్కల టీడీపీ నాయకులు బందెల నాగేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పేద పిల్లలను చేరదీసి విద్య, వసతి సౌకర్యం కల్పిస్తూ వారి బంగారు జీవితానికి బాటలు వేయటం అభినందనీయమని కొనియాడారు. సద్వినియోగం చేసుకొని వృద్ధి చెందాలని విద్యార్థులకు సూచించారు.

చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహావిష్కరణ

విశాలాంధ్ర-తెనాలి : కాటూరి ఆర్ట్ గ్యాలరీలో 20 టన్నుల ఐరన్ స్క్రాప్‌తో రూపొందించిన 21.5 అడుగుల ఎత్తు 18అడుగుల వెడల్పు గల ఆరు పలకల మండపంలో రాజసింహాసనంపై ఆసీనుడైన చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని కాటూరి కొండమ్మ ఆవిష్కరించారు. 20 మంది నైపుణ్యం కలిగిన టెక్నీషియన్లతో ఆరు నెలలుపాటు శ్రమించి ఈ కళాఖండాన్ని రూపుదిద్దామని శిల్పులు కళారత్న కాటూరి వెంకటేశ్వర రావు, కాటూరి రవిచంద్రలు తెలిపారు. వేల సంఖ్యలో ఆటోమొబైల్ విడిభాగాలు, నట్లు, బోల్టులు, బేరింగ్స్, చైన్లు వంటి ఐరన్ స్క్రాప్ భాగాలను ఉపయోగించి ఈ శిల్పాన్ని రూపొందించామని వివరించారు. ఐరన్ స్క్రాప్‌తో తయారు చేసిన విగ్రహం యావత్ భారతదేశంలో తమకు గుర్తింపు తీసు కొస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇటువంటి క్రియేటివ్ శిల్పాలను మరిన్ని ప్రదర్శిస్తూ కాటూరి ఆర్ట్ గ్యాలరీని ఒక ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలన్నదే సంకల్పం అని నిర్వాహకులు తెలిపారు.

ఆకట్టుకున్న 'గయోపాఖ్యానం వార్ సీన్'

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత సమితి, భాష సాంస్కృతి శాఖ సహాయ సహకారంతో నవ నవత నాటక గురుకులం నూజెండ్ల మండలం, ఉప్పలపాడు గ్రామంలో గుంటూరు వారిచే గయోపాఖ్యానం వార్ సీను పౌరాణిక నాటక ప్రదర్శన జరిగింది. శ్రీకృష్ణుడుగా ఎస్ఎ సలీంబాబు, అర్జునుడుగా ఎం.దేవరాజు తమ నటనతో ప్రేక్షకులను అకట్టుకున్నారు. ధనవంతుడు బీదలాజరు నాటకం ప్రదర్శనలో 1వ యేసుప్రభుగా ఎం.రాజేంద్ర ప్రసాద్, సమరయ స్త్రీగా ఎం.రాహేలు, 2వ యేసుప్రభుగా గాంధ్ల సాంబిరెడ్డి, లాజరుగా విఆర్.నంబుల యాదవ్, మోషే ప్రవక్తగా జి.అంజయ్య, ధనరాజుగా మంద వెంకట్రావు, చపలగా రమణశ్రీ, ఇతర నటీనటులు ప్రేక్షకులను మైమరిపించారు.

భగవంతుని నామాన్ని కులానికి ఆపాదించవద్దు

గుంటూరు: ఈ సకల చరాచర జగత్తుకు విశ్వకర్మ మాత్రమే సృష్టికర్త అని పలువురు వక్తలు తెలిపారు. శ్రీ ఆంధ్ర రాష్ట్ర దేశీయ విశ్వబ్రాహ్మణ సమాజం, శ్రీ వీరబ్రహ్మేంద్ర దేశీయ విశ్వబ్రాహ్మణ అసోసియేషన్ (ఎస్వీబీడీ వీబీ) విశాఖపట్నం సంయుక్త ఆధ్వర్యంలో గుంటూరు అరండల్ పేటలోని శ్రీ విరాట్ విశ్వకర్మ సామాజిక ప్రాంగణంలో ఆదివారం ఉదయం "విశ్వకర్మ - వేదవిజ్ఞానము 'గ్రంథావిష్కరణ సభ నిర్వహించారు. ఈ సభకు ఆంధ్ర రాష్ట్ర దేశీయ విశ్వబ్రాహ్మణ సమాజం అధ్యక్షులు జంపని రాధాకృష్ణమూర్తి అధ్యక్షత వహించారు. విశిష్ట అతిథిగా వీఏటీ ప్రొఫెసర్ ఆచార్య తియ్యబిండి కామేశ్వరరావు పాల్గొని గ్రంథ ఆవిష్కరణ చేసారు. అనంతరం మాట్లాడుతూ వేద ప్రామాణిక మైన విషయమే సత్యము అని, భగవంతుని నామాన్ని కులానికి ఆపాదించవద్దని, ఇతరుల మనోభావాలను కించపరచవద్దని కోరారు. ప్రొఫెసర్ మురుగుడు శ్రీవారి మాట్లాడుతూ వేదాధ్యయనం వలన హృదయ నిర్మల్యం ఏర్పడుతుందని, విశ్వకర్మ విశ్వతోముఖుడు వివరించారు. డాక్టర్ నాగార్జున కొండ సుందరాచారి మాట్లాడుతూ "విశ్వకర్మ" ఒక వ్యక్తి కాదు ఒక శక్తి అని, మానవుడు తప్ప సకల జీవ కోటి సుఖముగా ఆనందముగా జీవిస్తున్నాయని అన్నారు. వేద విజ్ఞానము తో అంతర్యామి ని తెలుసుకోవాలన్నారు. విలువలతో కూడిన క్రమ శిక్షణ తోనే మనం ముందుకు రాగలము అన్నారు. ఈ సందర్భంగా వక్తలు అందరూ గ్రంథ రచయిత గణేష్ బాబును అభినందించారు. గ్రంథ సంకలన కర్త, సమర్పకులు కొండపి వేంకట గణేష్ బాబు మాట్లాడుతూ వేదాలలోని వాస్తవ విషయాలను సమాజానికి తెలియచేయాలనే సంకల్పంతో తన తండ్రి గారైన కీర్తి కాయులు బ్రహ్మశ్రీ డాక్టర్ కొండపి నాగేశ్వరరావు స్థాపించిన శ్రీ వీరబ్రహ్మేంద్ర దేశీయ విశ్వబ్రాహ్మణ అసోసియేషన్ (ఎస్ వీబీడీవీబీ) విశాఖపట్నం 40వ (రూబీ) వార్షికోత్సవం సందర్భంగా ఈ ఆవిష్కరణ జరిపినట్టు చెప్పారు. ఆ సంఘం ప్రధాన కార్యదర్శి కందుకూరి శ్రీనివాస సుధాకర్ బాబు తో పాటు కార్యక్రమంలో పాల్గొన్న పాలక కార్యవర్గ సభ్యులు, అతిథులు, పాల్గొన్న ప్రతి ఒక్కరికీ గణేష్ బాబు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

గ్రంథావిష్కరణలో వక్తలు

డి పట్టా, పాసుపుస్తకములు పోయినవి

గుంటూరు జిల్లా, గుంటూరు సిటీ, రాజీవ్‌గాంధీ నగర్ 6వ లైన్, డోర్.నెం.7-6-846/3సి రు కాపురస్తులు లేటు. గనిక సత్యానందం గారి కుమారుడు గనిక హానోకు (సెల్ నెం. 9493243255) అను నేను తెలియజేయునది ఏమనగా,నా పేరిట ఖాతా నెం.2566 రు గల పల్నాడు జిల్లా, సత్తెనపల్లి మండలం, ధూళిపాళ్ళ గ్రామ సర్వేనెం.634/1-ఎ6 రు లో య.2-02 సెంట్లు భూమి కలదు. సదరు భూమి తాలూకా డి పట్టా మరియు పట్టాదారు పాసుబుక్ ది.15-12-2025న నేను జిరాక్స్ తీసుకొనుటకు ఇంటి నుంచి డొంక రోడ్డు నందలి జిరాక్స్ షాపునకు వెళ్ళుచుండగా మార్గం మధ్యలో ఎక్కడో పడి పోయినది. ఎవ్వరికైన దొరికిన యెడల పై చిరునామాలో తెలియజేయగలరు.

సీపీఐ శత వసంత ఉత్సవాలకు తరలిరావాలి

విశాలాంధ్ర-దాచేపల్లి: జనవరి 18న తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మంలో జరిగే సీపీఐ శత వసంతాల ఉత్సవాలను విజయవంతానికి ప్రతి ఒక్కరూ తరలిరావాలని పార్టీ గురజాల నియోజకవర్గ కార్యదర్శి మందపాటి రమణారెడ్డి, మండల శాఖ కార్యదర్శి కొమెర వెంకట్రావు పిలుపునిచ్చారు. ఆదివారం నిర్వ హించిన కేసానపల్లి గ్రామ శాఖ సమావేశానికి రాజశేఖర్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా వారు మాట్లాడుతూ 1925లో ఆవిర్భవించిన పార్టీ ఉద్యమ చరిత్రను వివరించారు. నాయకుల త్యాగాలు, పోరాటాలతో కూడిన వందేళ్లకు పైబడిన ఘనమైన పార్టీ చరిత్రను ప్రజలు ఆకళింపు చేసుకోవాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేయాలని కోరారు. పార్టీ ఉద్యమ చరిత్ర నేటి సమాజంతో పాటు భావితరాలకు కూడా ఎంతో మార్గ నిర్దేశమన్నారు. నేతలు మురికిపూడి సర్వయ్య, ఆనంద్ కుమార్, కోటేశ్వరరావు, ముస్తఫా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, కార్మికులు, కర్షకులు, మహిళలు పాల్గొన్నారు.

అమ్మవారి క్యాలెండరు ఆవిష్కరణ

విశాలాంధ్ర-దాచేపల్లి: పెనుగంచిప్రోలులోని శ్రీతిరుపతమ్మ అమ్మవారి మాలధారణ ప్రచార సమితికి సంబంధించిన నూతన సంవత్సరం క్యాలెండరును ఆదివారం దాచేపల్లిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సమితి జాతీయ అధ్యక్షుడు తోకా కృష్ణస్వామి, రాష్ట్ర అధ్యక్షుడు అన్నం సైదులు మాట్లాడారు. స్థానిక శ్రీవీర్ల అంకమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో గంజినబోయిన గోపయ్య, చడమల సత్యనారాయణ, బేతంచర్ల కోనారావు, కొత్త రామారావు, సూరిబాబు, గునిశెట్టి శ్రీనివాసరావు, టంగుటూరి రమేష్ తదితరులు ఉన్నారు.

మిర్చియార్డు చైర్మన్‌కు అభినందనలు

విశాలాంధ్ర-పెదకూరపాడు: ఆసియా ఖండంలోనే మిర్చికి అతిపెద్ద ఎగుమతి దిగుమతుల మార్కెట్ గుంటూరు అని అలాంటి ప్రతిష్టాత్మకమైన మార్కెట్ కమిటీ పాలకవర్గ అధ్యక్షునిగా పార్టీ సీనియర్ నాయకులు మిర్చి యార్డు చైర్మన్ కుర్రా అప్పారావుకు లభించటం అభినందనీయమని పెదకూరపాడు మండల టీడీపీ నాయకులు అన్నారు. ఆదివారం మండల పార్టీ అధ్యక్షులు ఏటుకూరి బ్రహ్మయ్య నాయకత్వంలో కలసి వెళ్లి అప్పారావుకు అభినందనలు తెలియజేశారు. మాజీ మండల పార్టీ అధ్యక్షులు అత్తిమళ్ళ రమేష్, రాష్ట్ర ఎంఎస్ఎమ్ఈ డైరెక్టర్ గుడిపూడి చిన్న రాజు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు, హాస్పిటల్ కమిటీ డైరెక్టర్ అంద్ర ప్రసాద్, జిల్లా టిడిపి ఉపాధ్యక్షురాలు షేక్ ముంతాజ్ మాజీ మండల అధ్యక్షులు బెల్లంకొండ రాంగోపాల్రావు, గల్లా బాబురావు, సీనియర్ నాయకులు మద్దినేని సత్యనారాయణ, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు మక్కిన సాగర్ తదితరులు ఉన్నారు.

మహిళలకు ముగ్గుల పోటీలు

విశాలాంధ్ర-అమరావతి: మండలకేంద్రమైన అమరావతిలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్రాంతి సంబరాల్లో భాగంగా మహిళలకు పోటీలు నిర్వహించి బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పారేపల్లి పుష్పలత, ఎర్ర సరోజ, చేగు దివ్య, ధూపగుంట్ల విజయ, కందుల కుసుమ, గార్లపాటి గోపి, రామకృష్ణ, నందిగామ పవన్ రాజా, చేగు రాము తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని పశువుల కాపరి మృతి

విశాలాంధ్ర- సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం బృగుబండ్ల గ్రామ శివారులో ద్విచక్ర వాహనం ఢీ కొని పశువుల కాపరి చిమట శివ నాగేశ్వరావు మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానిక గ్రామానికి చెందిన నాగేశ్వరావు పశువులు మెపి సాయంత్రం తిరిగి వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో 88 తాళ్లూరు గ్రామానికి చెందిన ఇరువురు యువకులు ద్విచక్ర వాహనం పై వేగంగా వెళ్తూ పశువుల కాపరిని ఢీకొన్నారు. దింతో సదరు వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందారని అదే సమయంలో అటుగా వెళ్తున్న గ్రామానికి చెందిన కుమార్ బాబు విలేకరులకు తెలిపారు. సీఐ హేమరావు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సనాతన ధర్మాన్ని రక్షించటమే ధ్యేయం

విశాలాంధ్ర-రెంటచింతల: సనాతన ధర్మాన్ని రక్షించటమే ధ్యేయంగా ఆర్ఎస్ఎస్ పనిచేస్తుందని కాశీవిశ్వనాథ స్వామిజీ అన్నారు. ఆదివారం రెంటచింతలలో ఏర్పాటు చేసిన హిందూ సమ్మేళనంలో పాల్గొన్నారు. పురవీధులలో చిన్నారులు కోలాటాలు, జై శ్రీరామ్ నినాదాలతో వాసవి ఆలయం నుంచి కళ్యాణ మండపం వరకు వారీ ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో గుంటూరు విభాగ్ బౌద్ధిక్ శ్రీనివాస్, నాగభారతి, ప్రమీలా, నరసింహారావు, మల్లిఖార్జునరావు, రాజశేఖర రెడ్డి, సైదారెడ్డి, కేదార్ పెద్ద సంఖ్యలో అన్ని గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

భట్రాజు కులస్తుల బలోపేతానికి కృషి

విశాలాంధ్ర-రొంపిచర్ల: వెనుక బడిన భట్రాజు కులస్తుల బలోపేతానికి కృషి చేస్తున్నానని భట్రాజు కార్పోరేషన్ చైర్మన్ సరికొండ వెంకటేశ్వరరాజు అన్నారు. మండల కేంద్రమైన రొంపిచర్లలో ఆదివారం ఆయన పర్యటించారు. గ్రామానికి విచ్చేసిన భట్రాజు కార్పోరేషన్ చైర్మన్ సరికొండ వెంకటేశ్వరరాజు కు భట్రాజు కులస్తులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా స్థానిక రాజుల బజారులోగల కళ్యాణమండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ తమ కులంలో పేద వర్గాల వారికి, ఆర్థికంగా వెనుకబడిన వారికి కార్పోరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు అందజేస్తామని అన్నారు. శ్రీశైలంలో తమ సత్రము ఏర్పాటుకు స్థలం సేకరణ జరుగుతుందని అన్నారు. భట్రాజు సంఘం రాష్ట్ర కార్యదర్శి సరికొండ తిమ్మరాజు, మండల నాయకులు చక్ర వరం రమేష్ రాజు, ధేనువకొండ సాంబశివ రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) మాచర్ల వారి కోర్టు నందు

I.A. No: 116/2022, O.S. No: 35/2016

పిటీషన్ :

తోట వెంకటనారాయణ ...పిటీషనర్/వాది.

వర్సెస్

షేక్ వలిట మస్తాన్ వలి.

...రెస్పాండెంట్/ ప్రతివాది.

To,
షేక్ వలి @ మస్తాన్ వలి, తండ్రి. పెద జాన్ ముస్లిం, వయస్సు 46సం॥లు, వ్యాపారం, R/o. H.No.:15-1-837/1-2-3, నెహ్రూనగర్, పోలేరమ్మ గుడి వద్ద, మాచర్ల, పల్నాడు జిల్లా,

పైన తెలిపిన దావాను మీపై దాఖలు చేసి, వాది మీపై డిక్రీ పొంది ఉన్నాడు. డిక్రీలో తప్పులు దొర్లినందున డిక్రీ ఎమెంట్‌మెంట్ కొరకు I.A No. : 116/2022ను దాఖలు చేయగా, శ్రీ కోర్టు వారు మీకు నోటీసులు ఆర్డరువేసి యున్నారు. మీకు ఎన్ని పర్యాయములు నోటీసుల నిమిత్తము బత్తా చెల్లించినను, మీరు నోటీసులు తీసుకొని ఉండ లేదు. కావున మీకు చివరి వాయిదాగా ది. 31-12-2025 అయి ఉన్నది. కావున మీరు ది.31-12-2025న ఉ॥గం॥ 10:30ని॥లకు, పై కోర్టు వారి యెదుట స్వయంగా కానీ, వకీల్ ద్వారా కానీ హాజరై మీకు ఏమైనా ఆక్షేపణలు యున్న యెడల తెలుపుకొనగలరు. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానం చేయబడును.

వాయిదా ది. 31-12-2025.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

చిలమకూరి నాగిరెడ్డి, అందుగుల బాలజోజి

పిటీషనర్/వాదితరపు న్యాయవాదులు, మాచర్ల - 522426.

సెల్:9441129568.9866499323.

మహారాజశ్రీ అడిషనల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)మాచర్ల వారి కోర్టులో

O.S. No. 113 / 2022

పిటీషన్ :

జక్కా ఏడుకొండలు. ...వాది

మరియు

1)వేంపాటి సాంబశివరావు, 2)వేంపాటి శివ కుమార్, 3)మాడిశెట్టి సైదయ్య, తండ్రి. వెంకట్రామయ్య, నివాసం:తాడేపల్లి గ్రామం మరియు మండలం, గుంటూరు జిల్లా, 4)బండారు శ్రీలక్ష్మి.

... ప్రతివాదులు.

పై నెంబరు కేసులోని 3వ ప్రతివాదికు శ్రీ కోర్టు వారు ఎన్ని మార్లు దావా సమన్లు పంపినను, మీరు ఉద్దేశపూర్వకంగా దావా సమన్లు తీసుకోకుండా, కాలయాపన చేయుచున్నారు. కావున ఈ పేపరు ప్రకటనను దావా సమన్లుగా భావించి శ్రీ కోర్టువారి ఎదుట ది.06-02-2026 న ఉ॥గం॥ 10:30ని॥లకు హాజరు అయి మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల శ్రీ కోర్టు వారికి తెలియజేయగలరు. మీరు హాజరు కానిచో మీ పరోక్షమున శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

వాయిదా ది.06-02-2026

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము)

పేర్ల వెంకటేశ్వర్లు, M.A., M.L., న్యాయవాది.

మాచర్ల - 522426. సెల్ నెం. 9440612707.

కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటాం

ఎంపీ లావు, చీఫ్ విప్ జీవీ

విశాలాంధ్ర - వినుకొండ : నియోజకవర్గంలో కష్టాల్లో ఉన్న కార్యకర్తలను ఆదుకునేందుకు వ్యక్తిగతంగా రూ.5 కోట్లు నిధులను వెచ్చిస్తున్నట్లు ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ప్రకటించారు. ఆదివారం కార్యాలయంలో పట్టణ పార్టీ అధ్యక్షులు బొంకూరి రోశయ్య అధ్యక్షతన జరిగిన సుపరిపాలన- తొలి అడుగు కార్యక్రమంలో ఉత్తమ సేవలు అందించిన టీడీపీ కార్యకర్తలను పార్టీ అధిష్టానం అభినందించింది. ఉత్తమ కార్యకర్తలను గుర్తించి వారికి ప్రశంసా పత్రాలను ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, జీవీ ఆంజనేయులు అందజేశారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ పార్టీ అభ్యున్నతికి సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ అహర్నిశలు కృషి చేస్తున్నారని, రానున్న 20 ఏళ్లు అధికారంలో ఉంచే లక్ష్యంగా ముందుకు వెళుతున్నారని అన్నారు. అందరికీ ఆదర్శవంతులైన సీఎం చంద్రబాబు ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకువెళ్లాలని, ఆయన స్ఫూర్తితో ప్రతి కార్యకర్త పార్టీ అభ్యున్నతికి కృషి చేయాలని తెలిపారు. ఒక్కసారి అవకాశం అంటే ప్రజలు నమ్మి వైసిపికి అధికారం ఇస్తే జగన్మోహన్ రెడ్డి 10 లక్షల కోట్లు అప్పులు చేసి ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి చేయకుండా దుర్వినియోగం చేశాడని ఆయన విమర్శించారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజలను ఆదుకుందన్నారు. 4,500 కోట్లు పల్లె పండుగ పథకం ప్రవేశపెట్టి అభివృద్ధి దిశగా పయనిస్తున్నామన్నారు. కష్టపడి పని చేసే కార్యకర్తకు అండగా ఉన్నానని తెలిపారు. సుపరిపాలనలో- తొలి అడుగు కార్యక్రమంలో మెరుగైన సేవలు అందించిన 85 మందికి పురస్కార అవార్డులు రావటం అభినందనందనీయమన్నారు. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ కార్యకర్తలకు మేము కొండంత అండగా ఉన్నామని తెలిపారు. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా ఆదుకునేందుకు తాము సిద్ధంగా ఉన్నామని వివరించారు. ప్రతిపక్షాలు చేస్తున్న నిరాధారణమైన ఆరోపణలను కార్యకర్తలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. అర్హత కలిగిన వారికి బ్యాంకు రుణాలు ఇప్పించడం తన బాధ్యతని, చిన్న మధ్య తరగతి పరిశ్రమలు పెట్టుకునేవాళ్లు ముందుకు వచ్చి రాయితీ రుణాలు పొంది ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. కార్యక్రమంలో జిడిసిసిబి చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, ఐదు మండలాల మండల పార్టీ అధ్యక్షులు, పిఎసిఎస్ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్చార్జీలు, కన్వీనర్లు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

టీడీపీకి బలం, ధైర్యం కార్యకర్తలే : ప్రత్తిపాటి

విశాలాంధ్ర-చిలకలూరిపేట: తెలుగుదేశం పార్టీ బలం.. ధైర్యం.. తరిగిపోని ఆస్తి కార్యకర్తలేనని, క్రమశిక్షణ, అంకితభావం, నిబద్ధత, విధేయతలకు వారు ప్రతిరూపాలని, వారి తెగువ, పనితీరే కష్ట కాలంలో పార్టీని ప్రజలకు చేరువ చేసిందని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. ఆదివారం చిలకలూరిపేట పట్టణంలోని స్థానిక క్యాంపు కార్యాలయంలో ఉత్తమ కార్యకర్తలతో సమావేశమైన ప్రత్తిపాటి.. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ప్రజలకు చేరువ చేయడంలో మంచి పనితీరు కనబరిచిన 40 మంది పసుపు సైనికులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందించి అభినందించారు. కూటమి ప్రభుత్వ సుపరిపాలన.. ప్రజలకు, రాష్ట్రానికి శ్రీరామరక్ష వంటిదని, అలానే పరిస్థితుల్ని బట్టి.. ప్రజల్ని వేధిస్తూ, రాష్ట్ర అభివృద్ధి, జనసంక్షేమాన్ని అడ్డుకునే రాక్షసమూకను తుదముట్టించే రామబాణం కూడా అవుతుందన్నారు. సూపర్-6 సహా ఏడాదిలో మన ప్రభుత్వం అమలుచేసిన, చేయని హామీల్ని ప్రజలకు చేరువ చేశారని, సుపరిపాలనలో తొలి అడుగు పేరిట ప్రజలకు చేరువైన విధానం ముమ్ముందూ కొనసాగాలని ప్రత్తిపాటి సూచించారు. ఉత్తమ కార్యకర్తలుగా ఎంపికైన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా అభినందనలు తెలిపిన ప్రత్తిపాటి.. అందరితో విడివిడిగా ఫొటోలు దిగి, వారి ఆనందాన్ని పంచుకున్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమాధ్ ఖాన్, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, కామినేని సాయిబాబు, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, టీడీపీ నాయకులు గంగా శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-విజయపురిసౌత్: నూతనంగా పదవులు చేపట్టిన కార్యకర్తలు తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి చేయాలని మాచర్ల శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. మాచర్ల మండలం రేగులవరం తండా గ్రామానికి చెందిన సభావత్ జబ్బార్ నాయక్ పల్నాడు జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడుగా బాధ్యతలు చేపట్టారు. ఆదివారం జబ్బార్ నాయక్‌తో పాటు గిరిజన నేతలు ఎమ్మెల్యేని కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ గెలుపుకోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం కల్పిస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు వజ్రం నాయక్, మాచర్ల మండల టీడీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు రమావత్ గుందల నాయక్, స్వామి నాయక్, అశోక్, ఎస్ కే బాషా తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మహిళా కార్యకర్త చిన్నమ్మాయి మృతి

విశాలాంధ్ర- మాచర్ల : అనారోగ్యంతో టీడీపీ సీనియర్ మహిళా కార్యకర్త పిండేటి చిన్నమ్మాయి మృతి బాధాకరమని ఆ పార్టీ సీనియర్ నాయకులు శశి భూషణ్ రెడ్డి అన్నారు. ఆదివారం పిడబ్ల్యుడి కాలనీలోని చిన్నమ్మాయి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం శశి భూషణ్ రెడ్డి మాట్లాడుతూ చిన్నమ్మాయి నిబద్ధత కలిగిన మహిళ అన్నారు. ఆమె సేవలు పార్టీకి తీరని లోటన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ నేడు మన మధ్య లేకపోవడం బాధాకరమన్నారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదేశాలతో చిన్నమ్మాయి కుటుంబ సభ్యులకు రూ.10వేలు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. పార్టీ అండగా ఉంటుందని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం నగదును అందజేశారు. కార్యక్రమంలో బోయ వెంకటరామిరెడ్డి, భూసాని వేణు, గాజుల గణేష్, చంటి, రాముడు, శివా నాగరాజు, పీర్ వలి, చల్లా రాజారత్నం, తదితర నాయకులు పాల్గొన్నారు.

జర్నలిస్టులు ఐక్యంగా సమస్యలు పరిష్కరించుకోవాలి

విశాలాంధ్ర-చిలకలూరిపేట: జర్నలిస్టులు ఐక్యంగా మెలగి సమస్యలు పరిష్కరించుకోవాలని ఏపీయూడబ్ల్యూజే స్టేట్ కౌన్సిల్ మెంబర్ పుల్లగూర భక్తవత్సలరావు అన్నారు. ఆదివారం ఏపీయూడబ్ల్యూజే అనుబంధ చిలకలూరిపేట ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నిక పట్టణంలోని రోటరీ కమ్యూనిటీ హాలులో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులకు అండగా ఏపీయూడబ్ల్యూజే నిలబడుతుందని, వారు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై పోరాడుతోందని వివరించారు. మరో స్టేట్ కౌన్సిల్ మెంబర్ షేక్ జిలాని విశ్రాంత పాత్రికేయులకు ఇతర రాష్ట్రాలలో అమలు చేస్తున్న పాత్రికేయుల పింఛన్లను మనరాష్ట్రంలో ప్రారంభించాలని, రైల్వేపాస్‌లను వెంటనే మంజూరు చేయాలని, ఇతర సమస్యలపై ఏపీడబ్ల్యూజే రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. ఎన్నికల అధికారిగా సీనియర్ జర్నలిస్టు నార్నే బాబ్జీరావు వ్యవహరించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ గౌరవ అధ్యక్షుడుగా కాట్రు శ్రీనివాసరావు, అధ్యక్షుడుగా పావులూరి బ్రహ్మానందం, కార్యదర్శిగా ఉప్పాలబాలు, ఉపాధ్యక్షుడుగా పుల్లగూర ప్రసన్నకుమార్, సహాయ కార్యదర్శిగా డి.మల్లిఖార్జునరావు, కోశాధికారిగా చుక్కా విజయ్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యవర్గ సభ్యుడు షేక్ అల్లాబక్షు, మాజీ అధ్యక్ష కార్యదర్శులు అన్నాలదాసు గిరి, షేక్ అబ్దుల్ సత్తార్, నియోజకవర్గంలోని జర్నలిస్టులు పాల్గొన్నారు.

నేటి నుంచి వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు

విశాలాంధ్ర - దాచేపల్లి : శ్రీరాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో సోమవారం నుంచి వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు జరుగుతున్నట్లు తంగెడ గ్రామ పౌరోహితుడు జానపాటి సీతారామశర్మ తెలిపారు. భక్తులు, మహిళలు అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.

సీపీఐ శత వసంతాల వేడుకలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - నకరికల్లు: సీపీఐ ఆవిర్భవించి నూరేళ్లు అవుతున్న సందర్భంగా నాయకులు చల్లగుల్లపల్లి కుంకలగుంట గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు మాట్లాడుతూ జనవరి 18వ తేదీన ఖమ్మం నగరంలో సీపీఐ శత వసంతాల వేడుకలను ఘనంగా జరగనున్నాయని దానికి కార్యకర్తలందరూ నకిరేకల్ మండలంనుండి పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. పార్టీ వందేళ్ల ప్రయాణంలో ఎన్నో పోరాటాలు ఎన్నెన్నో త్యాగాలు చేసిందని భూమి కోసం భుక్తి కోసం ప్రజల విముక్తి కోసం పోరాటాలు చేసిందని అన్నారు. సంపూర్ణ స్వతంత్రం కావాలని నినదించిన పార్టీ సిపిఐ అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర సమితి ముద్రించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు ఉప్పలపాటి రంగయ్య, నాయకులు ఎస్కే చిన్న జాను, సైదా,కోయి శ్రీను, హుస్సేను, బాధినీడి జగన్నాథం, కేసన్నపల్లి నాగేశ్వరావు, కుమారి నారాయణ, తప్పెట్ల పుల్లయ్య పాల్గొన్నారు.

యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి: ఏఐవైఎఫ్

విశాలాంధ్ర - వినుకొండ : పట్టణంలోని శివయ్య భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పల్నాడు ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు మహంకాళి సుబ్బారావు మాట్లాడుతూ ఎన్నికలలో కుటమి ప్రభుత్వం గెలిచిన తర్వాత ప్రతి సంవత్సరం జనవరి నెలలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి కూటమి ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్న ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయకుండా కాలయాపన చేస్తున్నారని మరియు యువగళం పాదయాత్రలో నారా లోకేష్ నిరుద్యోగులకు ఉద్యోగం ఇస్తామని, లేకపోతే నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత కాలయాపన చేస్తున్నారని అన్నారు. ఏపీపీఎస్సీ గ్రూప్ -1, గ్రూప్ -2, డిప్యూటీ డీఈవో, ఫారెస్ట్ డిపార్ట్మెంట్ వంటి నోటిఫికేషన్ కోర్టు కేసులో ఉండడం వలన తీవ్ర జాప్యం కావడం వలన నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారని, కోర్టు కేసులు సత్వరమే పరిష్కరించి ఉద్యోగాల ప్రక్రియ ప్రారంభం చేయాలని కోరారు. హామీలను అమలు చేయకపోతే ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ ఏరియా కార్యదర్శి మరియబాబు, ఏఐవైఎఫ్ నాయకులు అభి, మాతంగి అజయ్ పాల్గొన్నారు.

కార్మిక పరిషత్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా కొమ్మాలపాటి రమేష్ బాబు

విశాలాంధ్ర-వినుకొండ : నరసరావుపేట కార్మిక పరిషత్ యూనియన్ ఆఫీస్ నందు పల్నాడు జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొమ్మాలపాటి రమేష్ బాబుని (వినుకొండ డిపో), సెక్రటరీగా బొజ్జా నాగార్జున (నరసరావుపేట డిపో) ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 9 మందితో నూతన కమిటీ ఏర్పాటైంది. ఈ కార్యక్రమంలో నరసరావుపేట డిపో సెక్రటరీ కె సి హెచ్ శేఖర్ రావు, వినుకొండ డిపో సెక్రటరీ పోట్ల చిన పేరయ్య, చిలకలూరిపేట డిపో సెక్రటరీ అద్దంకి వరప్రసాద్ రావు, సత్తెనపల్లి డిపో సెక్రటరీ ముసునూరి శేఖర్ బాబు పాల్గొన్నారు.

వైసీపీ బ్యానర్లు తొలగించడం అవివేకం: బొల్లా

విశాలాంధ్ర - వినుకొండ : పండుగ రోజుల్లో కూడా కక్షపూరితంగా, వైసీపీ నాయకులు కార్య కర్తలు ఏర్పాటు చేసుకున్న బ్యానర్లు తొలగించడ మేంటని మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆగ్రహించారు. ఆదివారం వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బొల్లా మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వారు ఏర్పాటు చేసిన బ్యానర్లు అలాగే ఉంచి కక్షపూరితంగా వైసిపి బ్యానర్లు తొలగించడానికి ఆయన తప్పు పట్టారు. బ్యానర్లకు మున్సిపాలిటీ వారు డబ్బులు కట్టించుకున్నారా ఉంటే ఆ చలానాలు చూపాలని కమిషనర్‌ను బొల్లా కోరారు. పట్టణంలో అభివృద్ధిపై దృష్టి పెట్టకుండా అధికార పార్టీ వారు కక్షపూరితంగా ఈ బ్యానర్లు తొలగించడం ఏంటని అన్నారు. ఎక్కడో ఏదో చేశారని వినుకొండలో ఇలా చేయడం విచారకరమన్నారు. వేల్పూరు గ్రామంలో తన హయాంలో తానేమి అభివృద్ధి చేయలేదని ఇరువురు అధికార పార్టీ ప్రజాప్రతినిధులు విమర్శించడం వారి అవివేకం అన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఎంతో అభివృద్ధి చేశానని, గ్రామంలో చుట్టుపక్క గ్రామాలకు తాగునీరు రోడ్లు వసతి కల్పించానన్నారు. అలాగే పెదకంచెర్ల గ్రామానికి కూడా రోడ్డు వేయించానన్నారు. కానీ ఇప్పుడున్న అధికార పార్టీ వారు పెదకంచెర్ల గ్రామానికి పూర్తిస్థాయిలో తాగునీరు సరఫరా చేయలేని పరిస్థితుల్లో ఉన్నారని, పెదకంచెర్ల చెరువులో రెండు ఎకరాల భాగం విడగొట్టి తద్వారా ఓవర్ హెడ్ ట్యాంకులు ద్వారా జనాభా అధికంగా ఉన్న పెదకంచెర్ల గ్రామానికి తాగునీరు సరఫరా చేయవచ్చు కదా అని ఆయన ప్రశ్నించారు. అలాగే ఈ మారు పట్టణంలో వైసీపీ సంబంధించిన బ్యానర్లు తొలగిస్తే సహించేది లేదని బొల్లా హెచ్చరించారు.

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

గ్రంథాలయానికి టీవీ, కంప్యూటర్ అందజేత

విశాలాంధ్ర-దుర్గి: స్థానిక శాఖా గ్రంథాలయంలో టీవీ, కంప్యూటర్లను విద్యార్థులు వినియోగించు టకుంటున్నారు. గ్రంథాలయంలో ఉన్న వార్తపత్రికలు, పుస్తకాలు, పోటీ పరీక్షల పుస్తకాలతో పాటు కంప్యూటర్లు, టీవీ సదుపాయాన్ని వినియోగించుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని గ్రంథాలయ అధికారి పులిబండ్ల వేణుగోపి విద్యార్థులు, పాఠకులను కోరారు. విద్యార్థులు ఖాళీగా ఉన్న సమయంలో కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించే ఆశయంతో బెంగళూరుకు చెందిన శివశ్రీ చారిటబుల్ ట్రస్ట్ గ్రంథాలయానికి టీవీ, రెండు కంప్యూటర్లు ఉచితంగా అందజేశారు. దీంతో విద్యార్థులు, పాఠకులు ఈసందర్భంగా ట్రస్టుకు ధన్యవాదాలు తెలిపారు.

30న మండల పరిషత్ సమావేశం

విశాలాంధ్ర-అమరావతి: ఈనెల 30న మధ్యాహ్నం రెండు గంటలకు అమరావతి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మేకల హనుమంతరావు అధ్యక్షతన జరిగే మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి గౌరవ శాశ్విత సభ్యులతో పాటు మండల పరిధిలోనే వివిధ శాఖలకు చెందిన అధికారులు అనధికారులు ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని అమరావతి మండల ప్రజా పరిషత్ అధికారిని టీ.పార్వతి కోరారు. సర్వసభ్య సమావేశంలో వివిధ గ్రామాలతో పాటు, మండల పరిధిలోనే అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో, ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.

ఎమ్మెల్యేకు జానీ భాష కృతజ్ఞతలు

విశాలాంధ్ర-మాచర్ల : పల్నాడు జిల్లా టిడిపి పార్లమెంటు సెక్రెటరీగా ఎంపికైన మాచర్ల పట్టణం 26వ వార్డుకు చెందిన మాజీ కౌన్సిలర్ షేక్ జానీ బాషా ఆదివారం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డిని వెల్దుర్తి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు లభిస్తుందని, అది తెలుగుదేశం పార్టీలోనే సాధ్యమని అన్నారు. కూటమి ప్రభుత్వంలో గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రం అభివృద్ధిలో పరుగులు పెడుతున్నట్లు తెలిపారు. జానీ బాషా మాట్లాడుతూ సుదీర్ఘకాలం నుంచి తాను టిడిపిలో పనిచేస్తున్నట్లు తెలిపారు. తెదేపా కౌన్సిలర్‌గా, బూత్ ఇన్చార్జిగా చేసిన తనను అప్పటి వైసిపి నాయకులు ఎన్నో ఇబ్బందులు పెట్టినట్లు తెలిపారు. అయినా పార్టీ కోసం నిబద్ధతగా పనిచేసినట్లు పేర్కొన్నారు. టీడిపిలో తన సేవలను గుర్తించి తనకు పార్లమెంటు సెక్రెటరీగా నియమించటం సంతోషకరమ న్నారు. పార్టీ బలోపేతానికి తాను కృషి చేయనున్నట్లు స్పష్టం చేశారు. కొమెరా అనంత రాములు. తుమ్మేపల్లి పెద అంకారావు, నట్టు రవి, జరుగు మల్లి చెన్న, షేక్ అబ్దుల్ రసూల్, ఎం.నారాయణరెడ్డి పాల్గొన్నారు.

పెంతుకోస్తు చర్చి వార్షికోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-పెదకూరపాడు: దైవ చింతనతో ప్రశాంతతను పొందవచ్చునని కడప జిల్లా పెంతుకోస్తు సంఘం అధ్యక్షులు పాస్టర్ పుష్పరాలు అన్నారు. మండల పరిధిలోని 75 త్యాళ్లూరులో ఆదివారం పెంతుకోస్తు దేవాలయం ఐదవ వార్షికోత్సవ వేడుకలు పాస్టర్ జొన్నకూటి జై రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పాస్టర్ పుష్పరాజు మాట్లాడుతూ నూతన సంవత్సరం నూతన ఆలోచనలతో, మంచి నిర్ణయాలతో క్రీస్తు చూపిన బాటలో నడవాలని కోరారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర క్యాలెండర్ను, డైరీలను ఆవిష్కరించారు. స్థానిక సంఘ కాపరి పాస్టర్ జయరావు మాట్లాడుతూ యవ్వన దశలోనే మంచి నడవడిక అలవర్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ గుంటూరు బాబురావు, పెద్ద ట్రస్టు సంఘస్తులు పాల్గొన్నారు.

శేషారావుకు ఉత్తమ రైతు అవార్డు అందజేత

విశాలాంధ్ర-పెదకూరపాడు: జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రకృతి రైతు అవార్డును కేంద్ర ప్రభుత్వ విభాగం ఆర్‌సి ఓఎస్ఎఫ్ పెదకూరపాడు గ్రామానికి చెందిన దర్శి శేషారావుకు అందించారు. ఆదివారం గుంటూరులో జాతీయస్థాయి సెమినారు ప్రకృతి వ్యవసాయంపై నిర్వహించారు. ఆ సెమినార్‌లో జాతీయ ఉత్తమ రైతు అవార్డును శేషారావుకు అందించారు. ఆర్‌సిఓఎస్ఎఫ్ డైరెక్టర్ డాక్టర్ అజయ్ సింగ్ రాజ్ పుట్, ఆ సంస్థ సైంటిఫిక్ ఆఫీసర్ డాక్టరు వి ప్రవీణ్ కుమార్, ఆర్ వై ఎస్ ఎస్ మార్కెటింగ్ మేనేజర్ విజయ్, కోఆర్డినేటర్ మల్లేశ్వరి, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వం

విశాలాంధ్ర-చిలకలూరిపేట: కూటమి ప్రభుత్వం పాత సంక్షేమ పథకాలన్నీ పునరుద్ధరిస్తామని చెప్పి నేటికీ అమలు చేయడం లేదని సీపీఐ అనుబంధ గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.శ్రీను నాయక్ అన్నారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ కానుక, సంక్రాంతి కానుక, రంజాన్ తోఫా లాంటివి అందజేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. నేటికి ఈ విషయంపై మాట్లాడకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుందన్నారు. దానిలో ఏ ఒక్కటి అమలు చేయలేదని మండిపడ్డారు. తమ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్నామని చెప్పే మాటలు నీటి మీద రాతలు లాంటివే అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాస్టర్‌లకు గౌరవ వేతనం ఇచ్చి చేతులు దులుపుకుందన్నారు. జనవరి -2026 సంక్రాంతికి కానుక ఇస్తారో లేదో ఆందోళనలో ప్రజలు ఉన్నారన్నారు. తమ పాలన సంతృప్తిగా లేదని ఇటీవల కాలంలో ప్రజలకు వచ్చిన ఫోన్ కాల్స్ ప్రత్యేక నిదర్శనమన్నామని దుయ్యబట్టారు. ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నా, నిరసన కార్యక్రమాలు చేస్తామని కూటమి నేతలను హెచ్చరించారు.

ప్రజాహిత కార్యక్రమాలను అలవర్చుకోవాలి

విశాలాంధ్ర-దాచేపల్లి: ప్రజాహిత కార్యక్రమాలను అలవర్చుకోవాలని ఎస్సై షేక్ ఖాశింవలి ముస్లిం సమాజానికి పిలుపునిచ్చారు. ఆదివారం దాచేపల్లి కొట్ల బజారులోని జామియా మసీదులో నెల వారీ ఇస్తెమా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు అంజుమన్ కమిటీ అధ్యక్షుడు మౌలానా ముస్తఫా అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఖాశింవలి మాట్లాడుతూ నిరుపేదలను ఆదుకోవడం కోసం దానధర్మాలను ఇతోధికంగా చేయాలని కోరారు. మసీదు అభివృద్ధి కమిటీ నేతలు షేక్ మొహమ్మద్ జానీబాష (అర్మాన్ జ్యూయలర్స్), షేక్ బడ లాలా మాట్లాడుతూ ప్రతి ముస్లిం సోదరుడు అల్లా చింతనలో గడపాలన్నారు. రోజూ ఐదు పూటలా నమాజు చేయాలని కోరారు. శాంతియుత సమాజం కోసం ప్రతి ఒక్కరూ తోడ్పడాలని చెప్పారు. అనంతరం దాచేపల్లికి కొత్తగా వచ్చిన ఎస్సై షేక్ ఖాశింవలిని ఘనంగా సన్మానించారు. మత పెద్దలు మసీదు ఇమాం రఫీ, మౌలానా ఫారూఖ్, షేక్ జానీబాష (ఆషా జ్యూయలర్స్), కౌన్సిలరు షేక్ షరీఫ్, అబ్దుల్ రహమాన్, అబ్దుల్ ఖాదర్, యూనుస్, షేక్ షమ్మీ, సయ్యద్ రసూల్, ఘన్ను బుడే, మీరావలీ, పాప తదితరులు మాట్లాడారు. మసీదు కమిటీ పెద్దలు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.